వ్రాలుచో రాలు సిగపూల పరిమళములు
నూర్పు తావులు మేని చెమర్పు లొలసి
మది గుబాళింప ముని కంప మాన కరము
లంటి యంటక యతివ పయ్యంటఁబట్టె॥

కౌశికుని జాలి మేనక గడుసుఁ దనము
విధి విలాసము మన్మథు విక్రమంబు
కారణంబేదియైన నౌఁగాక తుదకు
ముష్కర తపస్వియొక వెన్నముద్దయయ్యె॥

సురలయాయ కచ్చరల చాతురికి మరుని
సాయకములకు యముని పాశములకైన
జడియ సుడియనన్ మదిపట్టు సడలదైన
వదలవామెను ముని కరాబ్జములు కనులు॥


ఱెప్ప వాల్పని చూపులోనుప్పతిల్లి
మేనఁ బారాడి తలఁపులో మెఱపు వోలె
భావమొకఁ టేదియో స్వయం ప్రభవమగుచు
నిగిడి మనసెల్ల మౌనికి నిండికొనియె॥

లలిత కుంతలయగు శకుంతల ప్రశాంత
మైన కణ్వుని యాశ్రమమందు తిరుగు
సరస ధర్మావతార దుష్యంత నృపుడు
భరతుఁడొకసారి తలఁపులోఁ దిరిగిరేమొ॥


ముమ్మరమ్మగు తమిదలంపులు చిగుర్పఁ
గౌశిక కరమ్ములా వాలుఁగంటి నెత్తి
యొయ్య నొయ్యన పెనచి పేరురమునంటి
మొగము మొగమంటిమనసంట దిగిచి కొనియె॥

మనసు నిండిన వలపుఁ పండినదొ యేమొ
విచ్చు కనులతోఁ జిఱునవ్వులిచ్చెఁ దరుణి
కునిపి కెమ్మోవి కసి ముద్దుగొనియె మౌని
కొంటె కోయిల పలికెఁ గోకో యటంచు॥

దేవతలు మౌనితపము బంధింపఁ బూని
పంపుటో తానుగా నామెవచ్చుటైన
యేది కారణమనుకొన్ననేమి! యందు
లోని మునిరక్తి, మధ్యమ లోకసిద్ధి॥



**జానుమద్ది హనుమచ్ఛాస్త్రి** **వై.సి.వి. రెడ్డి**



**వై.సి.వి. రెడ్డి** **పుట్టపర్తి నారాయణాచార్యులు**



పుట్టపర్తి నారాయణాచార్యులు, వై.సి.వి.రెడ్డి, నారు నాగనార్య, రాచమల్లు భైరవకొండారెడ్డి

# రంభ

# అంకితము

**కళాప్రపూర్ణ**

**స్వర్గీయ బళ్ళారి రాఘవాచార్యులకు**

# విన్నపము

'రంభ' నా మూడవ కావ్యఖండిక. నా కవితా వ్యాసంగమున నాలో జాలువాఱిన కొన్ని మధుర భావాలరూపమే 'రంభ'. ఈ కావ్యఖండిక ఆంధ్రుల మన్ననల నందుకొన్నచో ధన్యుడను. 'రంభ' రూపురేఖలు దిద్దుటలో వాత్సల్యత నెఱపి, యుత్సాహపఱచిన పూజ్యులకు, స్నేహితులకు నా హృదయపూర్వక నమస్కారములు.

ఈ కావ్యఖండికను – కళాజీవులైన ఆంధ్రులకు తీయనికలయైన కళాతపస్వి, కళాప్రపూర్ణ, స్వర్గీయ బళ్లారి రాఘవాచార్యుల కంకితమొనర్చి యోపినంత ఋణమీఁగితిని.

కడప, సంక్రాంతి, దుర్ముఖి.

భవదీయుడు,
**వై.సి.వి. రెడ్డి**
గ్రంథకర్త

గీ॥ వలపు తలఁపుల సెలయేఱు మలయపవనుఁ
దోడుకొని మందయానయై వేడు కలర
సాగె; నలకూబరుని పదసరసిజముల
నొరసి యానంద జలధి నుఱ్ఱూతలాడ.

గీ॥ నవ్యకమనీయ దివ్య సౌందర్యరాశి
రంభ; నలకూబరునితోడ రాసకేళిఁ
దేల సంబరపడె; జవరాలి వలపుఁ
జూఱఁగొనఁ జాలువాఁడు కుబేరసుతుఁడు.

గీ॥ వలపు నెత్తావి గుత్తుల వనములోనఁ
దలఁపుఁ జిగురాకులను మెక్కి కలఁత లడఁపు
ముగ్ధమోహన మాధుర్యమున నదించి
యాలపించెను గోయిల హాయిఁగూర్చి.

గీ॥ బలిసికొనివచ్చు తీయని వలపు తలఁపు
లలముకొను కూనరాగము లాలపించి
హర్షపులకితగాత్ర సోత్కర్ష మెంచి
శారికను జీరి కోరిక లూఱఁ జెప్పె.

గీ॥ తావిగట్టిన మదనుఁడు పూవుటమ్ము
లన్నిటికి సానబెట్టుచు నున్నవాఁడు

అలక కటువోయి నారాక లెలమిఁజెప్పి
నా మఱుంగున బ్రదుకుట సేమ మనుము.

గీ॥ కమ్మగాఁ దేటిగములు ఝుంఝుమ్మటంచు
ముసురుకొని పుష్పరజమున మసలి, మధువు
ద్రావి తన్మయతను, రానిరాగములను
మదుల చిలికించె; భోగసంపదలఁబంచె.

గీ॥ మధుపములు కూడిపాడ నీ మధురగీత
మమృత మొలికించె; మదులు సయ్యాటలాడె
తరుణ ధమ్మిల్ల ముడివోని తమినిఁతేపె;
లాలసత లల్లుకొనె, లోక మోలలాడె.

గీ॥ తారాకానాథుఁడుదయించెఁ దరులచెంత;
విచ్చె కల్హారముల చాలు – విచ్చెపొన్న
పొంచి కాంచనములు పిసాలించె – మించె
పిల్ల తెమ్మరతేజి రూపెత్తి మరుఁడు

గీ॥ పారిజాత మహీజమ్ము ప్రసవములను
దాల్చి సింగారియై వాఁకతాల్పునైన
రాగమున ముంపఁగల దిఁక రవళిసేయు
కొదమ తుమ్మెద రొదల వాకొనఁగనేల?

గీ॥ చేతనా చేతనములెల్లఁ జివురు లెత్తి
హృదయముల విచ్చి రాగ సంపదలఁ బొదలఁ
బాండురచ్ఛవి లోకాలఁ దాండవింపఁ
గలువ జవరాలు మగనిరాకల గణించె.

గీ॥ మిన్నువాఁకను జరియించు చున్న కతనఁ
గొదమ రాయంచయౌ తమ్మికొలము సూడు
వెక్కిరించుచు నడయాడె; వీని గర్వ
ముడుగ విహరింపవలెఁ దదూర్మ్మలను చల్లి.

గీ॥ అవ్యయానందమున నోలలాడుచున్న
వెన్నెలపులుంగు; వన్నెల చిన్నెలాడి;
కొమరుఁ బ్రాయవు విసురులఁ గొసరి కొసరి
పరవశత్వపుటంచులఁ బవ్వళించె.

గీ॥ రాగరస వీచికలదేలు రసిక వరుల
హృదయ వీణెల తంత్రుల కదలమీటి
యమృత మొలికించి వ్యోమాన నాటలాడె
లోలతలు నిక్కఁ జక్కందనాల చుక్క.

గీ॥ హృదయ వీధుల ఊేకెత్తి పొదలు నవ్య
భావముల సొక్కి లోలోనఁ బాడుకొనుచుఁ

గుసుమభరవాసనల సోలి మసలుచున్న
మంద మందానిలుని ఠీవి మదుల విచ్చె.

గీ॥ ఇది వసంతము తీయని పదము లాల
పించు కోయిల పెండ్లికై మించువేడ్క
సర్వసంభారములఁగొని నిర్వహింప
వెడలె మలయానిలుండు తావిని చెమర్చి.

గీ॥ అమలమై దివ్యమై జ్యోత్స్నలందుఁదేలి
యుబుకు స్వర్ణదీవీచిక లురలి రుచిర
కాంతులీనుచు నదియింపఁ గదలె, మధుర
భావనాలోక మరవిరి పానుపట్లు.

గీ॥ విశ్రుతారాధ్య రాసిక్య వీధులందు
ననలు కొసదేలి కెంపులై కనుల జాటి
గండములఁ బ్రాఁకి పెదవులఁ గౌగిలించెఁ
గలకవాటెనొ! తీయనికలల వాఁగు.

గీ॥ ఒలుకు తెలివాఁగు లీ విధూపల నివేశ
మరుణ కాంతులఁబూసె, నోసరిలి విచ్చి
పొదలు కల్హారముల దోఁగి, పుణ్యముబికి
పొదలు గట్టెనొ! రాగసంపదల కొఱకు.

గీ॥ శేఖరముఁదీసి దీర్ఘకైశికము విప్పి
అమల మందాకినీ తరంగముల దోఁగి
యారువెన్నెల వెలిపట్టు చీరఁగట్టి
కళల విరజిమ్మి గైసేసె గగనకాంత.

చ॥ అని మధుమాస వాసర సమంచిత సంపదలన్ దరంగ ని
స్వనములఁబొంగు భావరస వార్ధుల దొప్పలదోఁగి, శారికన్
పనిగొని పంచె రంభ; తన ప్రాణవిభున్ నలకూబరున్ గనుం
గొని, కొనిరమ్మటంచు; నది గొబ్బుననేగె విహాయసంబునన్.

సీ॥ ఉత్తుంగ గిరిశిఖరోపలంబులఁ జుట్టి
కలనాదములఁ బాఱుసెలలఁ గడచి
తమితేపు కుటజ సంతతి యుపాయన మంది
నునుపారు రత్నసానువుల మెట్టి
తలక్రిందులై ఘోరతప మాచరించెడు
సంయములున్న యాశ్రమము లరసి
కనుగల్గి పల్లవాంకముజేరి జొత్తిల్లి
వలగొను నభిసారికలను జూచి

గీ॥ యింపులొలికించు లేత మవ్వంపు లతల
మాటువడు దివ్యకాంతల మలఁగి చూచి
యచల శృంగాగ్రములఁబాటి యలకవైపు
మించువేడ్క శారిక పరతెంచె నపుడు

శా॥ ఆలో నచ్చటి కేగుదెంచె సురకన్యామౌళి మందార మా
లా లుంటాక మహాప్రభంజనుఁడు కై లాసాచలోత్క్షేపణో
ద్వేలాభీలభుజుండు రావణుఁడు దై తేయోగ్ర సైన్యంబుతో
హేలోద్వృత్తి సురేంద్ర సంపదల మా యింపన్ సముత్సాహియై.

మ॥ సకలోర్వీతల ముచ్చిపోఁబొడువ, నాశాభిత్తి దట్టించి చీ
లికలంజేయఁగ శైలశృంగచ యమోలిన్ దున్మితూటాడ శం
భుకరాగ్ర స్థితశూల మున్విఱువ, ముంపుల్ మూఁపులైనట్టి య
బ్ధికడల్నొక్కగఁజాలి వొల్చెనఁట! ఠీవిన్ కుంభకర్ణుండటన్.

శా॥ కాలాగ్నిచ్ఛట లారగింప సురలో కాప్రాజ్య సామ్రాజ్య ల
క్ష్మీ లావణ్యము లాహరింప జమునిన్ జీకాకు నొందింప నా
ప్రాలేయాచల మింత లింతలుగఁ ద్రుంపన్ఁ బెంపువాటించు, శౌ
ర్యాలంకారుఁడు వచ్చె నచ్చటికి డాయన్ మేఘ నాథుండొగిన్.

మ॥ సమదాటోపములుబ్బి ప్రబ్బికొన విస్తారాశనిక్షేపముల్
గమియన్ జేతులబట్టి నెట్టఁగల రక్షస్సేన వెన్నంట మృ
త్యు మహెూత్పాతము లూఁపి ఊపి యతికా యుండుగ్రుఁడై యంత నం
త మహేంద్రున్ బెడకట్టి యీడ్తునని చెంతంజేరె నుద్వృత్తిమై.

గీ॥ భయద కల్లోల జలధులఁ బట్టిత్రోవఁ
జాలు నుద్దండభుజదర్పశాలియై ప్ర

హస్తుఁడుద్దాముఁడై నిల్చె నద్రితటులు
పటియలై పేటులెత్త నుప్పరము వగుల

గీ॥ రావణుని సైన్యసము దయాక్రాంతి మించి
మాఱట లయాంతమో యన మారుమ్రోగి
కహ కహో రావసంరంభ కలిత మగుచు
నంతటన్ బ్రాఁకి హిమగిరి నాక్రమించె

గీ॥ అభ్రగంగాంబుధారల నంకురించి
మొలకలై పుంజుకొని సాగి మొగ్గఁదొడిగి
విరియ విచ్చిన పూవుఁ దీవియల పొదల
చుట్టు రావణు సైన్యంబు సుప్తిఁగొనియె

గీ॥ చల్లవెన్నెల పొలపులఁ బిల్లగాడ్పు
చౌకలింతల భావముల్ సంచలింపఁ
బరిధు లెఱుఁగక చెలరేగి పంక్తికంఠు
నంతరంగము పొంగిన యబ్ధియయ్యె

చ॥ పలుకుల కందరాని మధు వాసర రాగ రసోచిత క్రియా
విలసనముల్ వెలార్చి కను వేదురునన్ దనియించు చల్లగా
లులఁ దమి హెచ్చ రావణుఁడ లూన నవీన విలాస పల్లవం
బుల కెనవచ్చు నొక్క నన బోణికి నైతలపోసె నెమ్మదిన్.

మ॥ ఒక పున్నాగము మాధవీలతల యన్యోన్యానుషంగోత్స వో
త్సుకతన్ బారలుసాచె; నింగి కొలువై శుభ్రాంశుఁ డెంతెంత ప
న్నకముల్ పన్నెనొ! యిందు కాంతములు లోనన్ నిల్వ నీరయ్యె; నే
లికయౌ నీ హిమవంతుఁడున్ గఱఁగె బాళిన్ మేనకా దేవితో.

మ॥ ఒక నీలోత్పల మంతరంగ రస రా గోద్విగ్నయైవిచ్చి, న
ర్తకియై యౌదలయూఁచి లోపలి మరం దస్నిగ్ధ సౌరభ్య భా
వకషాయత్వము వెల్వరింప, శశిభా వంబెంత యుప్పొంగెనో!
సకలోర్వీతలమెల్ల వెల్లిఁగొనె జ్యోత్స్నా మందహాసంబులన్.

మ॥ తన యేనాటి తపః ఫలంబొ శశికిన్ దక్కెంజుమీ! యీగతిన్
బ్రణయోర్మ్మల్ పలుకెత్తి, తారకలు సంభావించి సొక్కించెఁ; గా
దనుచో - నిత్య నవీన యౌవన గరీయస్తారకాభోగ మం
దను దానెంతటివాఁడు; దేవతల కెన్నన్ జల్ది యన్నంబెగా.

చ॥ అమల సుధామయాన్నముల నందఱ దివ్యులఁ దృప్తివెట్టు వీ
ని మహిమ కొల్లబోను తన నేర్పులతో నొక పల్ల వాధరన్
రమణిఁ బయోజ గంధిఁగొని రాఁడుగదా ననుఁజేర; వీనికిన్
మమతలువేఱు పైపయిని మాటలు వేఱయి తాఱు చుండెడున్.

క॥ కలనాద గీతికలఁ జెలు
వలు రాగం బుట్టిపడఁగ వాసించిన రే

ల, లతాంతాయుధు కొలువుల
నిలువఁగ మనసయ్యె భోగినీ సంగతులన్.

గీ॥ అలమటలువెట్టి యుంకించి యంతకంత
కధికమౌ పాటుఁగల్పించె నతనుఁడిపుడు
తోడుపడు వాఁడులేడె! మాతోడువీడ
కెదిగి వచ్చిన పొలఁతుల కేమికొదువ.

గీ॥ కొదువలుండిన కొమిరెలఁ గోరనేల
నింత యెఱుఁగడో మదనుఁడు వంతలుడిపి
నాకునై యొక్క చక్కని నాతిఁజేరి
తలఁపు లెలయించి ననుఁబొంద మలపలేఁడొ.

గీ॥ మూడు లోకాల రాగాన ముంచగలిగి
నాయకీ నాయకులకెల్ల సాయపడఁడె
మాకు సాయముఁ జేయగా మనసురాదొ
మనసు లుండిన మార్గముల్ గనఁగరాదె.

గీ॥ దేవతల యాజ్ఞఁదీర్ప నా దేవ దేవు
ఫాలనయనుని మల్లించెఁ బార్వతికయి
దేవతల గెల్వఁదలపడు ధీరమతిని
నాదుకోర్కులఁ దీర్చు టన్యాయమగునె?

గీ॥ కోరుకొంటిని సుమచాప! కోరుకొంటి
కొదువ రానీకుమోయి, యాకొన్నవారి
నాదరించుట ధర్మమౌ, నంతకన్న
మించి నిన్నెవ్వరెప్డు డాసించినారు?

గీ॥ బలము గలదంచుఁ బాంథులపైన విరుగఁ
బడుచు నొదుగుట కాదురా, పరిమళించు
ప్రణయినీభావములఁ జిల్కు ప్రౌఢనిందుఁ
గంటినా, నిన్నుఁ బొరిగొందుఁ, గలఁత లడఁగు.

గీ॥ అనుచుఁ దలపోసి యాత్మఁజెదరు
నదరుపాటునఁ దనకేమి కుదురుపాటు
దొరకు నాయంచుఁ బౌలస్త్యుఁ డురక నచట
వేదనలమున్గి యలసట వేగుచుండె.

ఉ॥ ఆ లయ కాలరుద్రు నొకఁడై తొడదట్టి సవాలు చేసి క
య్యాలకుఁజేరి పోరగ్రల యట్టి జగద్ధిత విక్రమాఢ్యురా
గాలకుఁ బాలుజేసి కల కాలము ముంపులు వెట్టఁజాలు ప
ద్మాలయ పుత్రు నెన్నఁదర మా పరమాత్మునికైన నెప్పుడున్.

గీ॥ రంభ యాలోన సముచితారంభయగుచు
వలపు తలఁపులు కలనాదముల రచింపఁ

దరళ దరహాసరేఖ లంతరముఁ దెలుపఁ
బుష్పధన్వుని కోదండ మోయనంగ!

ఉ॥ మించిన ఠీవితోడ నుపమింపఁగరాని యలంకృతుల్ పిసా
ళించ మరాళయానము సలీలతదెల్ప ఝణం ఝణ క్వణ
త్కాంచన కంకణాద్య కరకంజము లొప్పఁగనిల్చి రంభ యూ
రించె రసప్రపంచ మధరీకృత మానవతీ ప్రపంచమై.

చ॥ అట నిలు, వీడి, వీడిన కుచాంశుక మొత్తుచు, వీటికారుచుల్
కటక దరీ ఝరీ చలిత గంధవహున్ మురిపించుచుండఁ బ్రా
కట నిజయానమున్ దెలుపు కాంచన కాంచిక కింకిణీ రవం
బట నటఁబ్రాఁకి రంభ యవునా! యనిపింపఁగఁ బోవు చున్నెడన్.

మ॥ తన కాంతిన్బురడించు మోముఁగని చింతామగ్నుడై, చంద్రుఁ, డా
తని సేవించెడు కల్వలున్ గనుల యందంబెంచి లజ్జించి యే
లినవారిన్ బలెఁగొల్చి రోయనఁగఁ బొల్చెన్ రంభ; లోకంబునన్
దనకంటెన్ ఘనులైన వారికడ యుక్తంబేగదా నమ్రతల్.

చ॥ బలియుఁడు చంద్రుఁ డొక్క మదబంభరవేణికిఁ జిక్కెనంచు, ని
మ్ములఁ గనిపెట్టి, జక్కవలు మున్నడి రంభను వేడి పేరుర
స్థలమున నిల్చినిక్కె ననఁ దత్కుచ కుంభ యుగమ్ముపొల్చెః శ
త్రుల బలవంతు సాయమున రూపడగించుట బోలునేగదా!

మ॥ తమ లావణ్యములెల్లఁ గొల్లఁగొని పంతం బాడు నా తన్వి, ముం
దు మెలంగన్ ధృతిదూల వ(్రుపలుగా దూఁగాడి దోగాడి న
(్రమములై పూవులు పండ్లు మోసి తమకున్ (బాపీయఁగావేడి వృ
క్షములన్ దీవియ లా(శయించె; నిటులౌఁగా దుర్బలా వస్థితుల్.

మ॥ తన సర్వస్వము రాగరంజిత వినూత్నస్వర్గ సౌందర్యమై
చనవుల్ గుల్కు పద(క్రమ స్వరలసచ్ఛబ్ద (ప్రపంచంబునై
చను రంభన్ భువి నస్తి నాస్తి విచికిత్సా హేతుశాతోదరిన్
దనశక్తిం గెలువంగ లేనని మదిన్ దర్కించె నా కాశమున్.

ఉ॥ ఇంతలు (క్రంతలున్న మఱుగెయ్యది మాకని లోఁగిదాగె నే
కాంతము మంచిదంచు నలుకల్గొని నల్లనిపిట్ట, లింత కే
రింతలు మాని బృంగము లరిన్గొని మన్మథు పజ్జఁజేరెఁ గా
లాంతరమందు నామె కుటిలాసిత కుంతలపాళిఁ గెల్వగన్

చ॥ మిల మిలలాడు తారకల మించు నఖద్యుతు లందగించు పా
టల పదపల్లవంబుల బెడంగులతో నడయాడునప్పుడ
ప్పొలతుక మిన్న ముత్తెములప్రోవులఁ గెంపుల (ముగ్గువెట్టి న
ట్లలరు గృహాంగణంబు; లవురాయని తోడిచెలుల్ కలంగగన్.

గీ॥ అంతకంతకు మధురోహ లతిశయింపఁ
బాదకటకంబు లల్లన భావగతికిఁ

దాళమానముగా, నామె తరలుచుండఁ
గలకలారవ మంతట గ్రమ్ముకొనియె.

ఉ॥ మీటినవిచ్చు గబ్బి చనుమిట్టలఁ బయ్యెద జారుచుండ మై
నాటిన పూవుటమ్ముల మనంబు కలంగుచుఁ జెక్కు టద్దముల్
పాటల కాంతులీన మదిఁబర్విడు భావములెల్లఁ గమ్మనౌ
పాటలుగాఁ బికశ్రుతులఁ బల్కగ రంభ సెలంగె నత్తఱిన్!

గీ॥ అంత పౌలస్త్యుఁ డీ కాననాంతరమునఁ
గాలియందెలు కమ్మని కంఠరవము
లెట్లు వినఁబడు? జవ్వని నెవతెనేని
కాన్క వెట్టఁడుగా పుష్ప కార్ముకుండు!

గీ॥ అనుచుఁ దలపోసి లేచి యంతంత నొక్క
కాలిత్రోవను బడిపోవు వాలుగనుల
వలపుల మిటారి నొకదానిఁ గలయఁజూచి
యబ్బిళులనొక్కి రావణుం డడ్డపడుచు

గీ॥ అబ్బురపు కాంతులీను సోయగముఁ జూచి!
నిబ్బరపు గబ్బి గుబ్బల నీటుఁజూచి!
యెడఁద బరువుల దించెడు నడుముఁజూచి!
కోరి తలయూచి మది వలపూర ననియె

ఉ॥ ఓ కుటిలాలకా వికసితోత్పల లోచన! నూపుర ధ్వనుల్
కోకిలలై నదింప నెటకో వడి నేగెదు? నామమెద్ది? చా
నా! కుసుమాస్త్రుఁగోరి పయనంబిటు సేసెదొ! నీ సువర్ణ కాం
చీ కలినిక్వణమ్ములు వశీకృతు నెవ్వనిఁ జేయనెంచితో!

శా॥ నీ వాల్జూపులలోని కాంక్ష లవిగోనీరాజనంబిచ్చె, నీ
భావా భావవిలగ్నమున్ బుడికి సంభావించు వాఁడెవ్వఁడే
దేవీ? నీ కౌఁగిటకెవ్వఁడుగ్ర తప మర్థిన్ జేసెనో? చేయుగా
కో వేల్పుం జవరాల నీ సొగసు లంతో యింతొ మా కందవో!

క॥ అని పౌలస్త్యుఁడు సంభ్రమ
మున నా లలితాంగి ముద్దుమోమునఁ జూపుల్
మునుకొనఁ జూచుచు నిలువన్
గని, తత్తర పాటు సెందెఁ గలికి యులుకుచున్.

సీ॥ వలగొని విటచిత్తముల కురుల్ దగిలించు
మెఱుఁగు వాల్జూపు తత్తరము లీన
సిగ్గు దొంతరలలో నిగ్గులుదేరు బు
గ్గలు చెమ్మటల మిల మిలలు దేర
మొగ మెత్తలేని వంపునఁ గ్రుంగు గళములోఁ
గలరవమ్మొలయు గద్గదిక లురల
నిశ్వాసములకొగ్గి నిమ్నోన్నతంబులై
కులుకు గుబ్బలు హళా హళులఁగునియు

గీ॥ అసలు పిడికిటిలోనిదే యగు వలగ్న
మంత కంతకు జవ జవ లాడిపోవ
నవనత ముఖేందుబింబయై యవ్వధూటి
యోరచూపుల దశకంఠు నుల్లమూచి.

ఉ॥ చూచి, నిలింప నాథుపరిచుంబిత వైభవమెల్ల నుగ్గుగా
నూఁచు తదీయ విక్రమ మనూన దిశా విజయ ప్రశస్తియున్;
జూచిన జవ్వనిన్ విడువఁజూడని వాని మదాంధ వృత్తియున్
జూచి, మదిన్ గలంకు దిగఁజోపుచు రంభ వచించె నీగతిన్.

ఉ॥ ఓ చతురాస్య వంశకల శోదధి పూర్ణ శశాంక! విక్రమ
శ్రీచులికీకృతాఖిల హరిత్పతి వైభవ! దైత్య సార్వభౌ
మా! చనవిచ్చి మీరలిటుమన్ననసేయఁ గృతార్థనే కదా
పూచిన రంభనౌచు వలపుల్ పచరింతు బిడౌజు కొల్వునన్.

క॥ అరలేని కూర్మి నా సం
బర మెంతయుఁజూచి దన్ను భవ్యుడు నలకూ
బరుఁజేరు తలఁపు త్రోపులఁ
బరువెత్తుచు నుంటి నలక వైపు మహాత్మా

చ॥ అన విని రాక్షసేంద్రుఁడు నిజాభిమతమ్ము ఫలించినట్ల రం
భను గని డగ్గరించి బిసవల్లరివోని తదంసయుగ్మమున్

జనవునఁ దట్టి యింతటి యసంగతమున్ బొనరింతువేల మా
నిని! నినువంటిప్రోడ యొకనిన్ మదిగోరుచుఁ బర్వులెత్తునే.

సీ॥ అంబు సమీర పర్ణాహారులై తప
స్సుల నిగ్గుదేఱు మౌనుల గణంబు
నియమనిష్టా సమున్మీలితాధ్వరమర్మ
పారదృశనము సోమపవ్రజమ్ము
ఇండ్లు భూములు సిరు లిల్లాలు మొదలుగా
నఖిలంబు విడుచు సన్యాసి గణము
వీర విక్రమ కళా విహరణంబులఁ దలల్
బలివెట్టి నట్టి వీరుల కులంబు

గీ॥ మింతలై మీదు భవనోప కంటములను
దిరిగి వేసారి నీపైఁట చెరగు సోకి
నంత ధన్యులమని యెంతురంట; యిట్టి
నీవు రంభవు పరులకై పోవుటేమి!

చ॥ అపరి మితానురాగ నిబిడాంతరులై నినుఁబొంది కామభో
గ పరవశాత్మ జీవిత వికాసము లెల్లను గాదెబోసి గు
త్తపు జిగిజవ్వనంబుఁ జరితార్థముఁ జేసెదు పూవుఁబోండ్లు నీ
కృపకయి వేచియుండఁ దగునే ననుఁగోరఁగ దానవేశ్వరా!

గీ॥ అనెడు రంభా ప్రియోక్తుల నాలకించి
మనసు తమకంబు మన్మథ మార్గణముల

రుసరుసలు వోవఁ బల్లవారుణ కరాగ్ర
మంటి దశకంఠుఁ డయ్యింతి కనియె నిట్లు.

ఉ॥ నీ మత మింతవట్టు తరుణీ వినిపించితి విట్టినేర్పు లో
కామిని! నీకుఁ గ్రొత్తలును గావు వినన్ జవిగావు మాకుఁ బే
రామునఁ ద్రుళ్లి మారుఁ డబలా! యదిగో ధనువెత్తె వాని మా
రాము లడంపఁ దోడు వడరా జవరాల! యనుగ్రహింపవే.

ఉ॥ ఈ విధుఁడీమరుండును సమీరణుఁడున్ దగుమూకలెత్తి నా
పై వికటించి; రీ యడవి పట్టున నా కెవరింకఁదోడు, శో
భావిభవోన్నతిన్ గఱుపు వాఱిన నీవలి గబ్బిగుబ్బలం
దో వరవర్ణినీ! యొదిగియుందు రహస్యపుఁ దా వొసంగవే!

మ॥ మనలో మాటకు సౌఖ్యసంపదల సీమల్గొన్న దీ రాత్రి వ
చ్చిన దిచ్చోటనె, నీవు వచ్చితివి: హెచ్చెన్ నా యదృష్టంబు! నేఁ
బనసల్ జెప్పి గడించు పున్నెములు కుప్పల్వోసి యాచించెదన్
ననబోడీ! ననుగూడి నీసొబగు విన్నాణంబు భోగింపవే.

చ॥ అని కసిముద్దులాడఁ జనునాతని కించుక దూరమౌచుఁ జ
య్యన పెడచేత నాఁగి వినయంబు భయంబు వివేచనంబునున్
బెనగొన రాచవారు నిరుపేదల భాగ్యము లూచముట్టుగా
గొనఁ దమకింతు; రింత వెడ గుందనమా! మిమువంటి వారికిన్.

ఉ॥ ఈ మధుమాస వాసరము లింతలు సేయఁగ దాళలేక స్వా
మీ! మము నడ్డిగించి బలి మిన్ పయికోఁ దగవౌనె? సంతలో
కామము లమ్ముకోదగిన కాతనొకో! మిము బోంట్ల కిట్లు పే
రామునఁ గాలుజారు టుర వా? సరివారలు విన్న నవ్వరా?

చ॥ వడి వడి లేచు భావముల వఱ్ఱున సోలుచు లేని పోని సం
దడిఁ బడి వెఱ్ఱి మొఱ్ఱి మమతల్ ఫలియింపఁగఁజూచి, వట్టి రా
యిడి పడనేల? గుండె బిగి యింపఁగ జాలవె? వెండికొండ నె
త్తెడు బల నిగ్రహంబు లిటు తీరినవే యొక లేమచెంగటన్.

మ॥ అలకాధీశు కుమారుఁజేర మనసై యంతంత కుప్పొంగు న
గ్గలపుంబ్రేముడిఁ దూలు గాలిపడగం గాఁబోవు నన్నెట్టి కొం
డలునున్ గోడలు నాపలేవు! క్షణమై నన్ జాముగాఁదోచి నా
వలపుల్ పర్వులు వాఱుచుండె; ననుర స్వామీ! కృపన్ జూడుమీ.

క॥ వలరాచవాని నెచ్చెలి
నలకూబరుఁ గోరి నడుచు నన్నాపకు, మి
మ్మలరించి యించు వేడ్కల
వలపించెడు భాగ్య మబ్బవలదా మాకున్.

చ॥ అన విని రావణుండు నలి నాక్షి! వివేకము లింతలౌనె మీ
కును! నిజ చిత్తవృత్తి కను కూలత లిందు పొసంగవంచు చె
ప్పిన యటులౌనొకో కనులు విప్పి కులంబు స్మరింపు మింత సం
తన యదియేల? నీ తలఁపు దారులు మాకు నెఱుంగ రానివే.

ఉ॥ మీ సొబ గింత లింతలయి మించి దివంబు భువంబు నిండి యా
సాసలఁబెంప లోని యురి యాటల నన్నిట నాటితేటి య
భ్యాసము నిశ్చితానుభవ మైనది యచ్చర పొందు విందు, స
న్యాసము దీసిగొన్న మగు వా! నగుబాటగుఁగాదె మాకిఁకన్.

ఉ॥ నీ పొక రాగభోగరస నిర్భర కంధివి; హావభావ వీ
చీ విసరంబులన్ దొరలి జీవిత సౌఖ్య సుధాఢ్య కుంభ మే
దో వెలికుబ్బ కుండ దెదురొత్తుల నాకది యబ్బకుండ దం
చీవిధిఁ జేయి సాచితిఁ గ దే; యిటుతప్పి కొనంగఁ జూచెదే.

మ॥ నిను నేఁగోరుట కానికార్య మనియున్ నీవో పరస్త్రీ వటం
చని వాచా చతురత్వ మచ్చు పడనో యబ్జాక్షి! మళ్ళింతువా!
నిను గారాముల దేల్చి దన్పుటకుఁబోనీ నే ననర్హుండనా!
వినవా మా విజయ ప్రబంధముల దన్వీ! యింత బేలింతువా!

సీ॥ నన్ను లాలించి నేనున్న చోటికివచ్చి
పరమ వేదార్థ భావములఁజెప్ప
నా తపస్సుల మెచ్చి ననుఁజేరి యర్థించి
వరముల నిచ్చి సంబరము నించు
తానుగా ముందుండి తత్పరత్వముతోడ
లంకలో నా కాపురంబు దిద్దు
పనివడి ననుదాఁకు వడిగల వీర యో
ధులనెల్ల జెండాడు మెలపు జెప్పు

గీ॥ కంటికిని ఱెప్పగా మముగాచి శుభము
లన్నిటి నొసంగు ముత్తాత యబ్జభవుఁడు
అతని కృపకుఁ బాత్రుండ నాయంతవాఁడు
పుణ్య మబ్బని వాఁడొకో పువ్వుబోఁడి!

క॥ ఇంతకు మించిన పుణ్యము
లింతీ యెందైనఁ జూచితే! మఱి నాదౌ
పంతము లంతకు సైతము
వంతల పాల్జేయు టెఱుఁగవా యెపుడైనన్.

ఉ॥ పాయని భక్తి నిచ్చలు శు భంకరు శంకరు దేవ దేవు భ
ద్రాయితమూర్తి భక్తజన తావన కల్పకమౌ మహేశు దీ
క్షాయతిఁగొల్చి శాత్రవని కాయ నిరాసము చంద్రహాస మ
త్యాయత భక్తి శక్తుల కుపాయన మందుట నీ వెఱుంగవే

గీ॥ అడ్డవాదము గల్పించి యొడ్డగెడపు
గొట్ట నీకేమి వచ్చెనే కొదువలేని
వైభవోపేతు ననుగూడవచ్చు, చనవు
లందవచ్చును రంభ మేలందవచ్చు.

ఉ॥ నా విని కావిమోవి యరుణారుణమై చలియించుచుండ సం
భావిత భీతి సంచల దపాంగములన్ దళితేంద్ర నీల శో

భావహ చంచలల్ దెసలి నాడఁ దలంకెడు రంభఁజూచి మో
హావిల చిత్తుఁడై యసుర యాతరుణిన్ గవయంగఁ బైకొనెన్.

కII చెలువము వలపులఁ జిమ్మఁగఁ
దలఁపులు తత్తద్వికార తరళతఁ బెంపన్
మలు పెఱుఁగని కలరవమున
సొలయుచు నా రంభ వెతల సుడివడు చుండెన్

గీII ముంచుకొనివచ్చు భయమున ముంచివైచు
చెమ్మటలదోఁగి కరసరసీరుహముల
రావణున కడ్డువెట్టి ధైర్యంబు కొంత
చిక్కపట్టుచు రంభ యోచించె నిట్లు.

మII తనకున్ మారెవరంచు దైత్యుఁడు కద ధ్వధ్వస్త మర్యాదుఁడై
ననుముట్టెన్, నయముల్ భయంబులిటు మాన్పన్ జాలునే వీని, నుం
డినచో నుండక యేల యీ వలపు గొంటిన్, గంటినీపాట్లు! బ
ల్మిని నామానము వీటిఁ బుచ్చకింకఁ దాల్మిన్ వీడు పోనిచ్చునే.

మII ఎవ రేమన్నను దండయాత్రఁగొని వారేరైన దండించి వై
భవ రక్షారతి వీరయోధ నిచయ ప్రాణంబులన్ దీసి వా
సవు నైనన్ జడిపించు దిట్ట యితనిన్ శాసింప నాబోటి న
ట్టువ కత్తెల్ సరిపోదురా! విటులు గుట్టున్ రట్టు భావింతురా!

చ॥ సవినయ భంగి యచ్చు పడఁ జల్లని మాటల హెచ్చరింప సుం
త వినడు, నా యెడందఁగల తాపము వల్కిన రూపలుబ్ధతన్
చెవి నిడఁబోడు, దేవతలె చెంగిరి, వీనికి లొంగిపోనిచో
నవినయ మెంత సేయునొ క దా! యెటు లీచెరఁ బాయనేర్తునో

చ॥ అని తనలోనె వందురి దశాస్యుని గన్గొని కామితార్థముల్
పనివడి తీర్చుకోఁ గలుగు బాహు బలాఢ్యులు మీరలిట్లు ప
ల్కిన మము బోంట్ల కింక గతి లేదుగదా యెటువోవ! మాపయిన్
మనము లగించు మీకయిన మాన్యత దర్పిత యెట్లుచేకురున్.

ఉ॥ ఒప్పని నాతి గోరు టది యొప్పని మీరనఁబోరు; కోరినా
రిప్పుడు నన్ను; నేను వరి యించినచో నదిలెస్స; కాక యే
చొప్పుననైన మా యభిరుచుల్ తెగగోయుటమేలె? దీనికిన్
చెప్పెడి దేమటంచు పెడ చేతల కుందిగ నుత్సహింతురే!

చ॥ విభవము లున్నతాశయ వివేకములన్ బొలుపొంటి నిత్యమున్
శుభములఁ గూర్పగావలె విశుద్ధయశంబు విపంచి కాశ్రుతిన్
నభమున మ్రోయఁగా వలె, వినన్జవి గావెలె గాక, మీరు మా
యభిరుచు లాచి త్రుంచవలెనా! ఫలమా యిది వైభ వర్ధికిన్.

మ॥ అతిలోకుండగు సుందరుండలఘుఁ డత్యంతానురా గుండు సం
తత భాగ్యోదయ పూర్ణుఁ డంచిత గుణోదారుండు యక్షేశ్వర

ప్రతిముండౌ నలకూబరుండు ననుఁబూర్ణ ప్రేమ రంజించు; నా
బ్రతుకెల్లన్ చెడగొట్టి తద్భుజ పరి ష్వంగచ్యుతన్ జేయుదే?

మ॥ మము మా పోకల బోవనిమ్ము; చనుమీ మా జోలి పోనాడి పం
తము మాపైఁ దలపెట్టఁబోకు, సతతోద్యద్భోగ భాగ్యంబులున్
మిము బొందన్ భజియింతు నీ విటుల నెమ్మిన్ జూపలేకున్న గా
మము, కార్పణ్యము మమ్ము ముంచెనని మామా చింతలంబ్రుంగెదన్.

క॥ అని బ్రతిమాలెడు రంభను
గనుచు దశాస్యుండు మెరయు కన్గొనల రె
క్కొను వలపు జిల్కు చూడ్కులఁ
జెనకుచు "రంభా యిదేటి చెలువ తనంబే"

చ॥ అలికులవేణి! యేటికిటులారట మొందెదు లేనిపోని మా
టల మెలివెట్టి, రంభ నకటా! యొక కాముకమౌళి రావణుం
డలమట వెట్టెనంచు మరియాదలు వోవఁగ లోకముల్ ననున్
దలచు నటంచు నెంచవు గదా, అగుచో భయమంద నేటికిన్.

ఉ॥ నేనొక లక్ష్యసిద్ధికి పనిన్గొని లోకము చుట్టుచుంటి; నా
పై నిలువెల్ల నిందలు నెపంబులు శాపము లున్నవైన, న
వ్వానికి బమ్మరించి నినువంటి జగా నెఱజాణ పొందు, జ
న్మానికి విందు, మానగలనా! బహుయజ్ఞ ఫలంబిదే కదా!

ఉ॥ నా యెడఁదన్ ధ్వనించెడు నినాదము లియ్యవి రెండు; సాత్త్విక
స్థాయిత నీశ్వరుం గొలిచి ధన్యత నొందుట రాజ సంబునన్
దీయని భోగముల్ గొనుట; తెంపరినౌ నను మెచ్చుకొంద్రు దై
తేయులు నాదితేయు; లొక దేవ విలాసిని తప్పుపట్టునే!

ఉ॥ ఈ విపరీత బుద్ధి జనియింపఁగ హేతువు జన్మకర్మ సం
భావిత పాపమో సురలు మౌనులు పెట్టిన శాపమో భవా
నీ విభునాజ్ఞయో తెలియనేరఁజుమీ! యెదియెట్టులైన నా
భావముఁబాయ వీశ పదభక్తియు, భావజ భోగరక్తియున్.

చ॥ తపముల సిద్ధి నొంది నిరతంబు శ్రుతి స్మృతి బద్ధ వృత్తులౌ
నిపుణుల కిట్టి కాంక్షలు జనించునొకో యనఁబోకు; మిన్నలౌ
తపసులుఁగూడ దేవవనితాసవిలాస కటాక్ష వాగురా
నిపతితులై భ్రమించుట గణింపవొ; తత్సుఖ మల్పమందువో?

ఉ॥ కారణ కార్య మిశ్రితమెకా జగమంతయు, నందు జన్మ సం
స్కారముఁ బాఱఁజూచిన విచారము లెందుకుఁబుట్టు, సంతతా
చార పరాయణత్వము యశస్కరమే యగుగాక, భోగముల్
కోరఁగ రానివౌనె? సమకూడవె నాకును భోగ భాగ్యముల్.

మ॥ వనజాక్షీ! మముజెందు మాన్యతలగొప్పల్ జెప్పుకోరాదు! మీ
ధనదాపత్యము రూపమున్ దివిజ నాథ ప్రాజ్య సామ్రాజ్య మీ
కొనగోరన్ దులఁదూగ యోగ్యమగు నొక్కో; వారి ముప్పొద్దు మ్రొ
క్కున కేనే పతినౌట యెంచవొకొ! మాకున్ వారి సామ్యంబటే!

మ॥ మిము మీ పోకలఁ బోవ నీ వలయు నేమీ? మాదు కార్పణ్య కా
మములే మిమ్మిటు సేసె నంచుఁ గౌఱతల్ మాపైఁ బ్రయోగింతు వో
సి, మిటారీ! మిడిమేల మాడి మదునన్ జెంగించి భంగించ వే
ల, మనంబుల్ వికసింప వెన్నెలలలో లాలంచి భోగింపవే

శా॥ ఈ జాబిల్లి వెలుంగు వెల్లువలలోనీ మంజు కుంజాంతర
భ్రాజత్కోమల పుష్పతల్పమున నన్ బ్రాపించి నీ కల్పవ
ల్లీ జైవాతృక బాహుపాశముల నోలిన్ నన్ను బంధింపుచున్
రాజీవానన! సౌఖ్యకేళి సలుపన్ రా నింక జాగేలనె?

చ॥ అభిరుచి తెల్పలేని వలపా! వలరాయని బారి కగ్గమై
యభినయ మేలసేసె దబలా! బయలెక్కి బలారి కొల్వులో
సుభగ విలాస లాస్యములఁ జొక్కొన గూర్చెదు జాణ విప్పు డీ
యభిసరణంబు గూర్చి హృదయంబున దాగుడుమూత లాడెదో!

చ॥ అన విని హావభావ పులకాంకురవత్కి లికించితమ్ములన్
మొనసిన మేనితో నిలువుపూచిన తీవియవోలె రంభ సి
గ్గునఁ దలవంచి చూపు మెఱుఁగుల్ కడకన్నులఁ బర్వ రాక్ష సేం
ద్రునిఁ గనుగొంచు నిల్చెఁ జివురుం బెదవిన్ మునిపంట నొక్కుచున్.

చ॥ మనుసునఁ గోరికల్ నిగుడ మన్మథ బాణములేచి తాలిమిన్
దునియలు సేయఁ దత్తరము ద్రోయఁ బశూద్ధతి కన్నుమూయ హె
చ్చిన తమకంబుతో బిగియు చేతుల సందిటఁబట్టి రంభ లో
గొనె దశకంఠుఁ డింతయును గోయిలబాడె "కూహూ కుహూ ధ్వనిన్"



శారదా సాహిత్య సమితి సాహితీ సభ్యులు శ్రీ. వై. సి. వి రెడ్డి గారిని స్థానిక ఇంజనీర్ శ్రీ. వై. వెంకట శివుడు గారు సన్మానించుచున్నప్పటి చిత్రం కూర్చున్న వారు సభాధ్యక్షులు శ్రీ. బి. సి. భట్ మేనేజర్ సిండికేట్ బ్యాంక్

# సిందూర రేఖ

# అన్నకు అంకితము

అనదలకు దారి బత్తెమై ఆదుకొన్న
అన్న; నన్నాదరించినయన్న; యమ్మ
నూరు వెంకటరెడ్డికి కోరి భక్తి
నంకితంబిత్తు నీ కృతి నార్ద్రమతిని

**వై.సి.వి. రెడ్డి**

**19.2.82**

# నా మాట

1953లో విద్వాన్ విశ్వంగారి "పెన్నేటి పాట"ను నేనూ, రారా ఇంకా కొంతమంది సాహితీ మిత్రులూ కలిసి చదువుకున్నాం. "పెన్నేటి పాట"లోని తీయని వూట నీటితో సేద దేరినాం. సంతోషం పట్టలేక విశ్వంగారికి ఒక ఉత్తరం వ్రాయడం జరిగింది. నా అభినందన లేఖకు వత్తాసునిస్తూ రారా కూడా సంతకం పెట్టినాడు.

పల్లె పట్టుల జన జీవితాలకు సంబంధించిన గాథను పద్యకావ్యంగా వ్రాయాలని అనుకొన్నాను. 1953లోనే 'సిందూర రేఖ'కు కృత్యాద్యవస్థ ప్రారంభమైంది.

ఈ పాడు పెట్టుబడిదారీ వ్యవస్థలో మంచి మంచోళ్ళు చెడిపోవడానికి వీలుందనీ, దిక్కులేనోళ్ళు దోపిడీలకు గురై బాధలో ఉన్నారనీ గుర్తించడం జరిగింది. ధర్మవ్యంజకమైన జీవితాలు కూడా ధ్వంసమవుతున్నాయి కదా – ఇందులో ఈ వ్యవస్థలో ఏదో లోటుందని చెప్పడం జరిగింది. నిర్మల ధర్మకర్మ దీక్షా పరతంత్రులు ఈ వ్యవస్థలో ధ్వంసమవుతున్నారని విశ్లేషిస్తూ, వ్యవస్థ మారాలన్న కాంక్షను దృఢంగా చెప్పడం జరిగింది.

తెలిసిన వృత్తికి సంబంధించిన కథ కాబట్టి వృత్తిపదాలు, మాండలికాలు కావ్యంలో బాగా చోటు చేసుకొన్నాయి.

పద్యాలుగానే వ్రాయాలని అనుకొన్నాను. వ్రాసినాను. కృతార్థతకై ప్రాకులాట నాకెందుకూ – పాఠకుడు కృతార్థుడైతే చాలనుకున్నాను.

జిలుగుల కంటే వెలుగులు నింపాలన్న తాపత్రయం. కొత్త సృష్టికాకపోయినా కొత్తగా చెప్పడం జరిగింది.

సేద్యగాడు ఒక ఉగాది నుండి ఇంకొక ఉగాది వరకూ రైతింటి పని విధానాన్ని చెప్తుతాడు. వసంత వర్ణనతో ఆరంభిస్తాడు. పొసగదని కొందరు అన్నారు. కావ్యాల్లో పొసగుతుందనే జవాబు. వాని ఊహల్ను పద్యాలుగా చెప్పడం జరిగింది; వానికి కవిత్వం వస్తుందని కాదు కద!

సాహితీ మిత్రులకు వినిపించడం జరిగింది. థీము బాగుందని కొందరన్నారు. పద్యాల్లో వృత్తి పదకోశం గర్భితమైందనీ కొందరన్నారు. కవిత్వపరంగా చెప్పుకోతగినంతగా లేదని కూడా కొందరి ఊహ. ఏమైనా అందరినీ మెప్పించాలంటే మాటలా.

శక్తిమేరకు కావ్యరూపాన్నిచ్చినాను. శబ్ద ప్రయోగాల్లో సాధువుల్నూ అసాధువుల్నూ రెండింటినీ కలగలపడం జరిగింది. నేను ఎన్నుకున్న రచనా పద్ధతి ఇది. ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

**వై.సి.వి. రెడ్డి**
**1953–82**

చ॥ దడబడనోబిగాడు తన తప్పెటపై చిరుమోదుమోది, యె
ద్దడిబడి పాలిపోయి కలతన్దిగజారెడు రామిరెడ్డి, ద
న్నెడు పిడిపడ్డనందరి వివేచనలన్ గురిచూచి గ్రామ చా
విడి కడ నమ్మజూపె తనవేలముపాటల వేటలాడుచున్

చ॥ ఒక సరికొత్త మానిసి మహెూత్సుకతన్ నను జూడ జీవముల్
తుకతుకలాడ సేయుపనితో శివమెత్తిన సేద్యగాని పూ
నిక వితయైన గాథల వినిందిత శీలుని వర్తనమ్ము పో
యక వడదేరు ధార్మికుని యాత్మ తపించిన తీరులన్నియున్

చ॥ ననుపురికొల్ప మానసము నందణగారిన జీవశక్తి ప
న్నిన యెడబాటు రోసి కనునింపెడు యుమ్మలికమ్ము తప్తకాం
చన ఛషకమ్ములోని సుడి చాలుల నెన్నిక చేసి చెప్ప నే
నును కరుణాత్మ గాథల యనూన యశోలతికా విపంచికన్

ఉ॥ మీటుచు రామిరెడ్డి చెలిమిన్ దనుపారిన యాత్మ నిర్వృతిన్
మాటుచు లోకమంతకును మాటున నూరక యేటుపోటుగా
మాటలమందలించి యొక మార్గము చూపక త్రొక్కిత్రొక్కినో
నాటిన యాశుగమ్ములయి నారు గదా యని చెప్పబూనితిన్

ఉ॥ ఎన్ని భవంబులందు భవదీప్సితమున్ గఱుపారి నూత్న సౌ
ఖ్యోన్నతి నోలలాడుచు యశోదయ రేఖల పర్వగీతికా

భ్యున్నతి సాగియాగినవొ! పున్నెములిట్లయి తెల్లవారెనో!
అన్న వచింతు నీ కథలకై జగమెంతగ నోచుకొన్నదో

మ॥ నను చిన్నప్పుడె చేరదీసి జనితో నాకున్న సర్వస్వమై
బెనిచెన్ పెండిలి చేసె చిక్కని దయన్ ప్రేమించి; నన్నాదరిం
చిన సాధూత్తముగాథలన్నిట యశ శ్రీలాస్య భారానతా
ననయై సేసలజల్లు చున్నది ప్రసన్న ప్రార్థితా రామమై

సీ॥ ఒకనాటి యీ యూరి సుకములకైపూని
కళల గేయుచు 'ముల్లుగట్టె' బట్టె
ఒకనాటి యీ యూరి యన్నతికైరేగి
పోటొడ్డితా 'చిల్లపోటు' బట్టె
ఒకనాటి యీ యూరి సకల విద్యలకునై
తడివెట్టి పులినీటి మడవలేసె
ఒకనాటి యీ యూరి తకరార్లకై తూగి
మిన్నులకెగజూచి మన్నుముంచె

తే॥గీ॥ ఒకడుగా నూరి వికలాంగులకు తెగించి
చెక్క గరుగుల నన్నిటి దుక్కిదున్నె
అంతటి యశశ్వికీనాటి కింతలయ్యె
నేమిగానున్నదో చెప్పలేము ముందు

క॥ అని యనుకొని తొట్రిలి, పెం
దొనలై పనుపాడి భావతోయజములకం

దని పూజ రెడ్డి కథగా
వున నిట్లని చెప్పబూని పొక్కుచువెతలన్

కII కలతలె మిత్రుని యెదదల
సెలలై దండడిని దుమికి జీవిక కొఱపై
మలుపోపక కథలల్లుచు
వెడలెన్ విశ్వమున పుణ్యవిశ్రుతులొలుకన్

గీII ఆ మలుపు దారిబడి పోవునామెజూడు
మామెయే రామిరెడ్డికి నోము ఫలము
కష్టములమ్రింగి సుఖశయ్యగా మనోజ్ఞ
మాలతీకుంజమై తన మగని దనిపె

శాII ఆ యిల్లాలి వినీతి జీవితము నందా నందమందాకినీ
తోయంబుల్ తరళమ్ములై నొలుక వాతూలమ్ములే పోరెన
న్నా! యందెన్ని విహరముల్ సలిపెనో నాళీకముల్ చీల్చుచున్
రాయంచల్ వికసించు మొగ్గలకు విన్నాణంబు సంధించుచున్

సీII అగ్నితో చెరలాటమాడు వర్తనముతో
నుతిగొన్న యాకులీనతను జూచి
కరుణించి మనసార నిరుపేదలను దన్పి
యలరించు పెట్టుపోతలను జూచి

మకరాంకు వలకేలి మాణిక్యదీపమౌ
విమల తనూ విలాసముల జూచి
ధనధాన్యలక్ష్ములుత్తాలమ్ములై నాట్య
మాడు నాయింటి భాగ్యములజూచి

గీ॥ ఆ మహాతల్లి నుద్వాహమాడ నెంద
రెందరో వచ్చిపోయి రానందలక్ష్మి
కైతపించి యుపాసించు నట్టి రామి
రెడ్డిగల డామె మదికెక్కు దొడ్డయనుచు

మ॥ ఒకనాడందరిమోదమందికొని యీ యూరెల్ల నానందల
క్ష్మికి సైదోడగు రెడ్డి పెండ్లి నమితోత్సేకమ్ము నిండార పూ
నికలల్లల్లన నిల్లువారిగొని పండింపన్ సదా వైభవా
త్మకమై యైదు దినాలు సాగె సతతో ద్యద్భోగ పర్వమ్ముగా

గీ॥ అతని పెండ్లియు రాజసూయంబె, యందు
నెందు నానందమున తృప్తి నొందనట్టి
ప్రాణియే లేదు గ్రామ సౌభాగ్యలక్ష్మి
యించు నవ్వుల వారి వరించె సమత

సీ॥ తన యింటి చాకలి కనుగలంబైనట్టి
పాడిమేకల రెంటిబట్టి యిచ్చె
తన యింటి తలవరిందనియింప నిల్లాలి
యొడ్డాణమిచ్చి తన్నోముకొనియె

తన యింటి మంగలిన్గని కొమ్ము పొట్టేండ్ల
గోరిన రెంటిని కూడదోలె
తన యింటి మాదిగెందనుప గాటను మేయు
కోడెదూడను పడ్డ దూడనిచ్చె

గీ॥ కుమ్మరికి గట్టు బంగారు కమ్మలిచ్చె
కమ్మరికి, వడ్లవానికి కట్టు పంచె
లిచ్చి, బియ్యముబేడలనిచ్చి ప్రియము
బల్కె మా రెడ్డి పెండ్లి గేవలపు భక్తి

క॥ అటు వలె నందరి యాత్మల
కటువేది దయారసమ్ము కలకలువారన్
గొటికాడక సవరించెన్
తటస్తమున వసించు కల్పతరువై మివులన్

గీ॥ ఊరి దేవతలందరి జేరి భక్తి
తళిగె బెట్టించి మాకు పూజలను జేసి
యర్చకుల దన్పె భావి భాగ్యముల గూడ
నర్పణము జేతునని బాస లాడియాడి

మ॥ అడుగో గంగడు చీకటింటి నలుసై యాకొన్న కంకాళమై
బడుగై బాములుగన్న బిడ్డడయి చూపన్ రాని చేటంతయే
ల్బడికిన్ నోచని వెక్కిరింతగనకూ పారమ్ములన్ దాటి వ
చ్చెడి దారిద్ర్య వనాంత వాయువుల కచ్చెన్ వాని సర్వస్యమున్

కII వాడీయూరికి వచ్చిన
నాడేమో గౌంతుకారి నకనకలాడే
వాడై వరుగై తరుగై
కూడుంగుడ్డలకు లేక కుందినవాడై

కII కన పడిన వారినెల్లన్
మునుముగ నూరెల్ల దిరిగి ముప్పిరిగొను జీ
వనమునకై దరిజూపగ
వినిచెన్ తన కష్టగాథ వేసటలలమన్

గీII కూటికై దైన్యమున మున్గి కుమిలి కుమిలి
కష్టముల కోర్చి మ్రోడుగ కఠినలోక
ముల వసించెడు గంగని తలపుదాకి
నెనరునన్ రెడ్డి పనికి రమ్మనియె వాని

ఉII వాడును వాడిపోయి పసివారిన గుండెల కాపు జిక్కగో
రాడిన కుమ్ముదిమ్ముల యెడాటము కన్నుల జారిపోవ, జీ
ఱాడిన శీర్ణదేహ నిబిడాంతరముల్ పొలికేక వెట్ట, మా
రాడక రైతు వెంటజనె నామని తీపులకాస జేయుచున్

గీII నాటి నుండియు నీయూర నాటుకొన్న
గుంజగా జీవములద్రోయు కూలివాడు
వాడు మనరెడ్డి యింటి సేవాటకమ్ము
చెప్పునని చెప్పునంతలో చెంతజేరి

గీ॥ కొలువు దీరిన యూరి పెద్దలను జూచి
తలకు జుట్టిన పాతగుడ్డల రుమాలు
కణతలలవ్రేల చంక మూకటిని నిరికి
వంగి తన దారిబోవు మాతంగు జూచి

క॥ "ఏరా గంగా యెక్కడి
కారాటములూఱ పరుగులాడెదు శాడల్
పూరాయై పోయినవా
రారా మనరామిరెడ్డిరా" యని యనగన్

గీ॥ కడుపు చుమ్మలుపోవ నాగాసగాడు
తన్ను పోషించినట్టి రైతన్న కతల
చెప్ప మొదలిడె యెడద వాసించునట్టి
తీయతీయని కలల కాత్మీయుడగుచు

ఉ॥ ఆ మహనీయునంతటి దబూపరుడూరక నాకు దక్కె, నా
నోములుపండె, జీవన మనోహరదృశ్యములెన్నియేని నా
బాములపారద్రోలెనన పాయతనావశమయ్యెనింక నా
స్వామిని ముంచు బన్నములజాలుల చూడగ లేక చిక్కితిన్

మ॥ కునియౌ నాగత జీవితమ్మున దయాకుల్యాంతరశ్రీ విది
ల్చిన పూమొక్కల రెక్కలంట మనసా సోకోర్చుకోలేని చిం
తనమే గాడిన గుండె లందుమికి వంతన్ ముంచి వంచించు; చా
లని నా బోటికి రెడ్డిగారి కథలాలాపింప శక్యమ్ములా

క॥ ఆనాటి కథలు కలలై
నోనాటిన ములకులట్లు నురుమాడెడి; తా
నా! నట్టిల్లున మురిగెడి
బోనంబై పరుల కొరకు బోనంబయ్యేన్

క॥ కన్నాకు జీవితంబుగ
మన్నన బంగారు పిడిచి మనగోరిన రై
తన్నకు చినాలి బ్రతుకా
అన్నన్నా! ఉట్టిపాటు లౌదలలెక్కెన్

గీ॥ అనదలకు దారి బత్తెమై యాదుకొన్న
దొడ్డరెడ్డిని కూడ నీదిడ్డికంత
జీవతమ్మునగ్రుక్కి శిక్షించునట్టి
కాలమును చూచుచుంటి నాకంటి నీట

క॥ ఏనాడు నన్ను పనిగొన
గానెంచెనొనాడె, నాకుగా కొట్టమ్మున్
తానే కట్టించెను పం
తానందలదన్నులేమి తట్టాడంగన్

గీ॥ తాను నడయాడు ధర్మమ్ముగాన నొక్క
నాడు మాతల్లి లక్ష్మమ్మ తోడగూడి
మాటలాడుచు నాలోని మర్మరముల
గెలికి పలుకుల జిలికె నగ్గలపు ప్రేమ

గీ॥ ఏమి – మనగంగడిట్లె 'యాసామి' వలెనె
యుండునా – పెండ్లి పేరంటముండవలదొ?
గున్నమామిడి చివురింపకున్న కోకి
లమ్మ కొమ్మల బాడు – రాగమ్ములున్నె?

గీ॥ అనుచు తనలోని తలపు కామనలు దీర్ప
విచ్చెనన మెచ్చునకు వచ్చు మచ్చెకంటి
నాలిగా కూర్చె మారెడ్డి; నవ వసంత
రాగముదయించె జీవితారామమందు

ఉ॥ మూపులు బిగ్గబట్టి, పురమూకటి చంకన బెట్టి, చీలికల్
దోవులకాగగట్టి, సరిదోలి పెనేసిన బిల్ల మోకులన్
వీపుల వ్రేలగట్టి, వడి వీడని వార్నెల చేతజుట్టి, యీ
కాపుల గొల్చు వానికి నకారణ సంపదలబ్బె నొక్కటన్

ఉ॥ నాజనకుండు తల్లియు ననారతముంచిన ప్రేమపెల్లు తా
నై జగమోమి నన్నుగొన నయ్యెశుభాంకము తాచుసౌఖ్యముల్
నాజతనమ్ములన్ గొలచి నన్నలయించెను; గల్లబానయున్
పూజలనందుకొన్నది యపూర్వము మాదొరగారి సఖ్యముల్

గీ॥ నా వివాహము జీవితాశావిభావ
రీ పరీమళజ్యోత్స్నా శిరీష కుసుమ
పేశలంబేమొ! పీయూష పిశితమయ్యె
రాగభావమ్ము దాంపత్యయోగములను

గీ॥ కమ్మకమ్మని రాగభోగముల దేలి
మాలతీ కుంజములుసోల, మమతలాచి
సొక్కునొక్కులలో తేనెసోనలురలి
యవని పులకించె ఫలిత దాహమ్ము తీరె

గీ॥ వండి వార్చిన బోనమ్ము వాలుపడిన
గట్టు బంగారు ముద్దలగని యనాది
ఫలము మారెడ్డి; పేదలపాలి కల్ప
వృక్షమను మాట మనసులూరించు మూట

చ॥ విమతుల దృష్టులందని కెవేయని తూరుపు నాటికోడె, నీ
మము కడముట్ట నీద్వగల మాన్యుడు మాపెదరెడ్డి, దాన సం
భ్రమముల రాశివోసి కులపర్వతపంక్తుల కూలద్రోయు స్థై
ర్యమునకు జన్మ భూమిగ చెలామణియై మముదన్నెనింతయున్

క॥ కడలొత్తు గడనలెడరై
కడుపారడి పూరి మేయగా వలసె కటా!
నిడుపులు కడుపులు కడునె
ట్టడు లేమిని కృషికి బూనుటే మనవలెనో!

గీ॥ మొన్నమొన్నటి దాక రానున్న కఠిన
కాలమును లెక్కజేయక చేల చెమట
లూడ్చి పండించె; నొకటి కాలూని యూర్పు
లుడుగ విహరింప లేదట్టి యూర్జితుండు

గీ॥ పుట్టనే లేదు మాసీమ; పుణ్య ఫలము
తొడిమ నెడబాసి మధు వృష్టి జడి గొనంగ
అందరందరె మునుపడి యారగించి
రాలసించిన మోసమౌనంచు ముసిరి

క॥ నను విల్చుకొన్న దాదిగ
కనికరముల నెలవు రెడ్డిగారికి కృషిలో
పనివింటి పంట నూర్చితి
ననఘా! నొక కొంత మీకుగా వినిపింతున్

చ॥ అది పరమాద్భుతంబు చిగురాకుల పాకల రాగభావ సం
మ్మదమెదనిండె జీవన తమమ్ములు దిమ్ముల కొమ్మగొట్టె, యి
ప్పిదముల దప్పిదీరె పరపీడన లోడె వసంత యోగ సం
పద కొదలేక దివ్యకుసుమమ్ముల యిమ్ముల లేయివీచగన్

మ॥ సహకారాలి వికీర్ణబింబిత ఫలాశాప్రాప్తిగానుంట, ని
స్పృహనిహ్నోదము టెక్కలన్గొని, నభస్సంబాధ కృత్తండదు
స్పృహమై రంజిత రాగరేఖలలమన్ సారించె వాసంతమున్
బహురుడ్డీనత నొడ్డివొల్చు రతిరాట్పట్టాశ్వముల్ సొక్కుచున్

మ॥ సకలాశాంత వినీల మాలికల శిక్షాదక్షమౌ మానినీ
నికరోదంచిత పాదలాక్షలతికా నేపథ్య సంపాతమో!
సకలామోద వసంతయోగ పదవీ సౌగంధ్యలాస్యమ్ములో!
వికసన్నిర్ఝర కామినీ వదన విద్వేషాంత రాగాఢ్యమో!

గీ॥ కోకిలమ్మల పాటల కోసమౌర!
కుసుమ భరవాసనా సౌఖ్యవిసరములను
మరిగి మందానిలుడు మాని మ్రాకులందె
చిగురుటాకుల సెజ్జపై వగల గులికె

చ॥ అనితర సాధ్యమౌ పికసమాశ్రిత కూజిత మాటపాటలై
మనముల మచ్చుజల్లె పవమానపురస్సర గంధమంగనా
జన ఘన వేణులందొదిగి సార విచార విఘూర్ణ మానసా
చణరణితమ్మునింపె మనజాలిన కాముక కోడెకాండ్రకై

గీ॥ ఉదయరాగమ్ముతో చనవుంచి, మంచి
గంధగుణ గౌరవమ్ములకాంతి బెంచి
హరిహరుల గూడ వాగెలనడ్డి, చరమ,
సంధ్యను హసించి మించె, వసంతలక్ష్మి

గీ॥ రావియాకుల మొలనూళ్ళు, మావి చిగురు
ముక్కునత్తులు నొక్కుల సొక్కుమల్లె
మొగ్గకమ్మలు యనటాకు నిగ్గు పైట
జిలుగు హరితాంబరములు వాసించె బయల

చ॥ క్వణ దణు కింకిణీ కలిత కాంచన కాంచిక లాటపాటలై
గొనెనన, తెక్కలార్చి యెద కోపులవంచి, యనంగ సూక్తముల్
వినుమనె, పంచమస్వరము విన్చె, వినోదపు కోకిలమ్మ, ము
క్కున రసరాగ విభ్రమపు కూర్మల యూర్మిక లల్లిహాయిగా

మ॥ ఎలప్రాయంపు మిటారి వల్లికల కప్డే లేత చూలబ్బె; పో
కల పూబాలలు తూగుటుయ్యెలల కాకాంక్షించి రంతంతకున్
పులకల్ పుట్టగ దక్షిణానిలుడు సొంపుల్ దిద్ది చుంబించె; పో
దలపేలా మదబంభరాలకిక; దత్తాదృగ్విలాసాలకై

చ॥ కుసుమిత మాలతీ సవిధ కుంజము సంజల మంజువాణి నా
మసలి హసించె నౌర! కసుమాలపు కోకిల పాట లెంచుచున్
అసమసమీహితాంతర విహంగమ భృంగములంట; కానిచో
అసదృశమౌ రుతీకలిత మౌటకు కారణమున్నె! యెన్నడున్

మ॥ లలితోద్యాన శుభాంగి నిండు కొలువై లాలించి పాలించె, ని
స్తుల భోగమ్ముల బంచి; కాదనిన సాసూయాత్ములై రాగరౌ
యలికైశీకుల పాలికా నయన కల్హారాధ్వకాంత్యుత్కట
మ్ములు నొప్పింపక పోవు మన్మథుడు చంపున్ తెంపు వాటించుచున్

గీ॥ ఆ మనోహర దివ్య భవ్యాత్ములైన
పూల బాలల నును కపోలాల పుణికి
నవ వసంతుడు ధర్మదండంబుగొనె; న
యారె! రైతులు ములుగట్టెలంటిరపుడు

ఉ॥ వాలపు కుచ్చులన్ గగన భాగ పరాగసరాగ కాంతులన్
దోలుచు కుంకుమాంకపు దినోదయమో! మణిరోచులుబ్బుహై
మాలయమో! యనంగ బలుపౌ పసికోడెల కాడిగట్టె యు
ద్వేలపు కోర్కెలన్ పులక దేరెడు సైరికు డంతలోననే

గీ॥ యాల పాటల కూనిరాగాల తోఁజు
లంతకంతకు చిక్కనలై యనూహ్య
భావమై పదబంధమై ప్రాచిరోచి
కలకవాఱెను సానురాగమ్ములగుచు

ఉ॥ నేనును మట్టెకోడెల వినిర్మలకర్మల దివ్యసేవ్యతా
ధీనమనస్వినై, తలుపు దీసి, బిగించితి కోపుత్రాళ్ళ ప
గ్గానను పల్పుత్రాళ్ల నరిగా తరితీపుల నంజుకొంచు, వి
న్నాణము రెడ్డిగారి దయ నాయెడ నయ్యెడ గాఢమౌటచే

తే॥ కోర్కెకోటేరుతో మంచిగోరి యూరి
గవని దాటితి రీవిరెక్కల నటింప
పట్టుపగ్గాలపై భోగముట్టి పడగ
సిలుగులెరుగని తొలినాటి సేద్యమునకు

తే॥ చేవిమునుకున పన్నకంబూని, కాడి
మేడి సవరించి పగ్గాలతోడ, ముల్లు
గట్టెవల చేతగైసేసి మట్టెకోడె
మలుగుపై సైగచేసితి మడకబట్టి

తే॥ అడుగుమడుగున పొలివొని ఆత్మశక్తి
పొడవులైసాగ యఱ్ఱుసాపుచు – విశాల
తలముపొలమును దున్న నాగలిని – పూనె
నొక్కయూపున కోడెలభ్యుదయమునకు

తే॥ ఉదయరాగమ్ము యెడ్ల కన్నుదల మెరసి
సాలుదప్పని యోర్పుల సంతరించె
లాంగలపుటారు నులివోక లాగుబాగు
తూగె; తూగెడి మూపుర తోరణముల

తే॥ తొలుకు బలుపున చూడ సొంపుల వెలార్చు
కోడె జంటకు; నాదు వ్యాకోచ నిర్వృ
తీరుతీ గర్భుమౌ మాటతీరు తెలిసె
నౌర! సైరికుడెంత వింతైన కవియొ!

తే॥ లక్ష్యసిద్ధికినై త్రోపులాడు భావ
మలసట లెరుంగునే! తలపొలముదాటు
సాధువై – మావనవాళి బాధలణచు;
వాడి పలుగున కడ్డమా యీడుపాడు!

కం॥ ఆవఱపు దుర్కి శుభ సం
భావనకావలయు, కలల పండింపులెవో
తావులజల్లెను నాయెద
కోవల; వాకొనగరాని కోరికలలమెన్

తే॥ కోరికలతూగు భావదూకులములను
మలుపుద్రిప్పుచు విదలించి మరలి, మరల
నఱకవట్టితి కోండ్రకై నఱ్ఱుసాచి
పూనునెద్దుల పట్టు పగ్గాన పూని

తే॥ ముక్కు చెలిపెల నూర్పులు ముసరుకొనగ
తోకరిక్కించి దూకు నెద్దులకు పిల్లి
గిట్టలకు మన్ను తగలలేదట్టె! నాటి
మాధురీభరభావసంపదల దలతు

తే॥ నాడు కోడెలతో గెడుగూడి – శుభము
లెంచి తొలిమలిసాళ్ళసాగించి – మడక
పన్నకంబూడ్చి కోటేరుపన్ని; యింటి
కేగుదెంచితి భోగసంయోగమెంచి

తే॥ సమత బెంచెడి యానాటి సంబరమ్ము
లలమె రైతింట; దంటలేపొలము కాపు
బ్రదుకు లోకమ్మునోము సంపదకు జాలి
తేలుచున్నది కీర్తి చంద్రికల దోగి

తే॥ కోడికూతలతో చెలకోల ముల్లు
గట్టె బట్టిన చేతుల కాటవిడుపు
మిట్టమధ్యాహ్నమే సడివెట్టవెరచు
గాలిలో మూగుటూర్పులు కలసిపోయె

తే॥ మట్టిలోబుట్టి మెట్టినమ్మకములుంచి
పూజలొనరించి పంటసొంపుల వెలార్చి
విశ్వమున కీర్తికెక్కిన విమలమతుల
రైతు బిడ్డల భావసంపదల భవము

తే॥ లెట్టివోకాని సిరుల రాబట్టు బుద్ధి
వట్టి సేద్యాల పొలములబట్టి కష్ట
పడగ గడగిరి మట్టికై బండ్లు గట్టి
పల్లెనేయేలె నుత్సాహభరము కరము

తే॥ తొలకరింపుల భూమాత పులకరించి
పలుకరించిన, దాత్మల పరవశించి
రైతుబిడ్డలు, హరితాంబరముల బెట్టి
సంబరము సేయగడగి ముచ్చటలు పడిరి

తే॥ మొలకపున్నమితోడు కావలయునంచు
ఊరిసొమ్ములు వనితలు చేరి, క్రొత్త
బట్టలు ధరించి, పండుగ పాటలన్ని
పాడి ఆడిరి – ఆయేటి పంట దలచి

తే॥ పొలుపు మీరిన మొలకలపున్నమికిని
పిండివంటలు జేసిరి పెద్దరెడ్డి
యింటి యిల్లాలు లక్ష్మమ్మ యేలుబడిని
పొట్టుజొల్లల కొలది రేప్రొద్దులందు

తే॥ అంబలి బదులు – నిప్పట్టు లారగించి
సేద్యమున కేగుచుంటిమి – సేద్యగాంధ్ర
మైన మేమంత మారైతు – మంచిగోరి
ఉన్న సంగతి చెప్పుకోనుత్సహింతు

తే॥ అందుకోలేని హిమగిరి నాక్రమించి
మించి వెన్నెల కుప్పల సంచి మొదలు
విప్పిబేరాలు చేసితి – వెదుకబోవ
కాల దగిలిన తీవగా – కదలె బ్రతుకు

తే॥ వరుపు సేద్యాల తదుపరి – వర్ష రుతువు
మొదల ముంగారి పదునుల – మొలకలెత్తు
గడ్డిగాదము చేలలో కలుగకుండ
గొఱ్ఱుగుంటక సేద్యాలు కూడ చేసి

తే॥ ఎరువు ఎంపలి – మట్టితో నేపు మీద
కలిపి – చేలకు తోలితి మలవికాని
సంబరమ్ములు కనులలో జాలువార
గెట్టువారల వరకును – చెట్టుపుట్ట

తే॥ గొట్టి – గుంటక సేద్యమ్ముకూడ చేసి
అదను పదనుకు వేచి – యాయాసముడుగ
నుంటి మాయేటి పంటలనుంచ తివిరి
చేల నాలుగు చెఱగుల సేద్యమందు

తే॥ సమముగా భూమి తెగునట్లు జరిపినాము
పదునుపట్టుట కనువుగా – బాగు చేసి
నాము – మా రైతు గొప్పపంటల దలంచి
మాకు తృప్తిగా పెట్టు ధర్మాత్ము పనిగ

శా॥ ఉల్లోలంబుగ కల్లుద్రావిన బలీ మోదగ్రఖుక్షా ధ్వ భో
గోల్లాసంబగు మేఘ మండలములైద్యుత్పాత సంకీర్ణ సం
పుల్లాభీల ఘనాఘనంబయి మహాస్ఫోటప్రభాజాలమై
కల్లోలంబయి వర్ష విభ్రమము పాకంబయ్యె నానాటికిన్

మ॥ ఒక విల్లందిన మేటి ధీరుని శరం బొక్కొక్కటే నేలగ్రు
చ్చుకపోదూసినయట్లు వానబడె నిస్తుల్యప్రభాధారగా
సకలామోద వినూత్న సంపదలు రాసాగెన్‌గదా మాకు – న
మ్మకమై పంటలు వచ్చునట్లగ పడెన్ మాయూరి భాగ్యమ్ముగా

చ॥ అదనున పెద్దగా పదనులయ్యెనికేమని గొఱ్ఱుకఱ్ఱుకున్
పదపదమంచు కమ్మరినిబట్టి సపాటుగ కఱ్ఱుకఱ్ఱుకున్
పదునుగ కల్లువాదెరల పట్టిరి; ముట్టిరి వడ్ల దాళికై
పదుగురు పర్వులెత్తిరి శుభంకరమౌ జడిగాల పూజకై

ఉ॥ శక్తికి మించి చేయగల శ్రద్ధనదాటున పుట్టుకొచ్చె – మా
భుక్తికి భూమి యిచ్చునను పెద్దల మాటలు హెచ్చరింప – నా
సక్తములాదృతున్ కలియ సర్వవిధంబుల విత్తనంబులా
సక్తిని దెచ్చి కూర్చితిమి సర్వసమగ్రముగా సమంబుగా

మ॥ ఒక దర్పోద్ధత కాంతిరేఖ దివిపైనుద్బుద్ధమైతోచె, పృ
ద్వికి భాగ్యోదయమయ్యెనయ్యెనన, నుద్వేలంబుగా బంధురో
దక పాకంబున రొంపిలేని పదనై తన్పొందె భూమాత, నై
కకళాసంభృత దివ్యనైచికి మృగాంక ప్రాభవోత్సవమై

మ॥ అళినీలాలకలప్సరోగణములవ్యక్తాను రాగంబులన్
తెలినీటన్ జలకంబులాడి దివిషద్వీధిన్ విడంబించి, చి
క్కులు వాయన్ కచసంతతిన్ దులుప రుక్కుల్వోని తేజిన్కు లీ
వలిలోకమ్ముల ధారలై కురిసె దివ్యంబైన బంధంబుగన్

చ॥ అనుపమ దివ్య భోగమతినై, సమరాంగణ భూమిభూరి ని
స్వనపటుధాటికిన్నిలుచు వాడుగ, తోడగు నైజశక్తి ప
న్నిన కనరాని యుత్సుకత నిండిన గుండెలు కొండలైనవో
యన, చిగురించు కామనల యాచితమై ఫలియింపగోరితిన్

చ॥ వినమిత మూర్ధమై కడిది విత్తముతా పృథులోపగూహ వ
ర్తనమున జాలువారు ఒక రమ్యవపుఃపరిణామమైన వా
టున – ననవిల్తుకోల్తల విటుల్ తమకించిన వేళ నిత్య నూ
తన సహకార వారమవుతన్ జడి విత్తనముల్ దలంపగన్

సీ॥ ఒకపాటిరైతు వేరొకపాటి రైతుతో పోటీల కాండ్లకై మాటగలిపె
కూలివానికికూడ కొత్త కోర్కెలు పుట్టె ప్రతిరైతు పంటలో భాగముకయి
ఇంటిమాదిగల పూరింటి వాసముకూడ రాశిగింజల గొల్చు వాసికెక్కె
ఇంటి చాకలి కడుపు మంట చల్లారగా వంకల తెలినీటి వాలులమరె

తే॥ కమ్మరికి కుమ్మరికిగూడ కలుములబ్బె,
వెట్టి యానాది కూడ నవ్వించె సతిని
ఎలుకబొరకల ధాన్యముల్ గలుగునంచు
వాన గురిసినదంచు భావముల పొంగి

తే॥ మంచి దినమును చూచి రామయ్య తండ్రి
గాటిపూజల జేసి మాకాడిమేడి
బైటపెట్టించె తొలినాటి బతుకులెంచి
విత్తనమ్ముల సాగింప నుత్తల పడి

తే॥ మారు చేనంచు ముమ్మారు మడక సేద్య
మైన దంచును పదును బాగైన దనుచు
సంబరంపడి రెడ్డి యిష్టము కొలంది
చక్కగా గొఱ్ఱుతోలె నాసారితానె

తే॥ దారమును బట్టినట్లు యాదారిబోవు
రైతులందరు చకితులై రామిరెడ్డి
సేద్యమే సేద్యమని చెప్ప చేలమంద
పట్టెలన్ కూడా నూలుకు పట్టె సాళ్ల

తే॥ ఆ యేటి విత్తనమ్మున
ఆయనయే గొఱ్ఱుతోలి – అట్లందరితో
తీయని పలుకుల గొనె – మా
నాయన – మా రెడ్డి – మాకు నమ్మిన తోడై

తే॥ పొలము గుండెలు చివురించి పోడములను
చూపెనా – పైరుమొలకెత్తె – శోభలొలుక
చాలుచాలునయొత్తుగా – పోలుపొందు
లేక అడ్డము గడ్డియులేచె వడిగ

తే॥ గడ్డిపోమెట్ల గుంటకల్ గట్టినప్పు
డాయనే మెట్లగుంటక – అలసిపోక
తోలినాడయ్య – బండిరుసుతోడు బరువు
పెట్టి – బలవంతుడాయన పెద్దకాపు

తే॥ కట్టుపోకుండ గుంటక కదియ పట్టి
లోతు తెగునట్లు కోపు కాలూని కూడ
మంచి సేద్యముదా చేసి మంతుకెక్కి
మాకు నేర్పెనునాడు – మమ్మాదరించి

తే॥ కొండలకు పోయి కన్నెల కొత్తగడ్డి
కోసి మోపులుగా తెచ్చి కోడెలకును
వేసి మేపుటనాపని – తోసిపోని
ఫలితముల – పంటకెగజూచి – ప్రతిదినమ్ము
చేలగట్టుల నిలబడిసోలిపోతి

తే॥ అడ్డమాగెల లేక గోర్లాకు పెరిగె
చేని సతవంత పెరుకు నంచేను – గడ్డి
తీయబోయితి – మునుముగా – తెలియరాని
అవ్యయానందముల తోడు – ఆలిగూడి

తే॥ రకరకాలగు పైరుల – సకలధాన్య
ములను పండించి పై పాతరలను నింప
కోరుకొంటిమి యాయేటి – తీరు జూచి
కూలినాలికి లోటు లేకుండ దలచి – వలచి

తే॥ పల్లెనేలెడు వనితలు పరుగులెత్తి
యింపుదళుకొత్త సంగటి గంపలెత్తి
చేలశ్రమియించు కూలీల చేతులందు
ముద్దలుగ పెట్టినారు సమ్ముదము మీర

తే॥ అన్నపూర్ణలు మాయూరి ఆడవారు
ముద్దు కూళుళ్లు సంగటి ముద్దలెత్తి
కడుపునిండుగ బెట్టిరి – గట్టి పెరుగు
గడ్డలను విరిచి – చేతులకందినంత

తే॥ చేలగట్టుల పెరిగిన వాలుగడ్డి
గోసి బరెగొడ్లకై అమ్మగూడ దినము
మోసె గంపలకొలది – సొమ్ములకు సొమ్ము
తల్లి లక్ష్మమ్మ మా రెడ్డి తలపు దాకి

తే॥ కరుకులో జొన్నలౌ కాసికాలు బాటి
బలముకొని, రెట్టలావైన బలుపుదంట్లు
పొట్టలను బెట్టి – సంగటి ముద్దలంత
లేసి కంకుల దీసె పోటేసినట్లు

తే॥ కంకిపై సుంకుమోసెను – కలుచపెడిసె
లన్ని– పిసుకుళ్లు ముక్కల నటమటించి
తినగ – గుంపులు గుంపులు – తెంపుసేసి
పైరుపై వ్రాలజొచ్చెను – భయము లేక

తే॥ మంచెలమిరించి వొడిసెల్ల చంచులవియ
కొట్టి తోలితిమాయేడు – కొంచెమైన
తీరికేలేదు – పైరులు తీరుదనుక
కోతకొచ్చినదాన దక్కోలుగాగ

తే॥ కంచెలను దొండదోసలు మించికాసె
బీదబిక్కికి కూరల బెడద లేదు
జొన్న పిసుకుళ్ల దోసెలు నున్నపప్పు
చాల తింటిమి మొలత్రాళ్లు సళ్లు విడిచి

తే॥ కందికాయలు అలసందకాయలనప
కాయలుడికించి తిన్నాము కడుపులుబ్బ
కొత్త పంటల వంటలు కోడెలకును
గంపలకొలంది తినిపించగలిగినాము

తే॥ కొఱ్ఱకోతలుకోసి కోకొల్లలుగను
గాదెలను కందనమ్ముల గంపమోత
నింపి రైతింట సంబరాల్ నింపినాము
కుండలన్నియు నిండుగా నుండెనపుడు

తే॥ జొన్నకోతలు మొదలయ్యె – వున్నసెనిగె
కట్టె – వాములుగావేసి – కాయలన్ని
పీకి డబ్బాల కొలదిగా పీకినాము
ఆలుపిల్లలతో కళ్లమందెయుండి

తే॥ కట్టెకాయలు పీకెడు కాలమందు
ఊరకుక్కలు కూడ దబ్బరలు కాదు
తినుచు కక్కుచు కళ్లాల తిరుగుచుండె
అందరికి డబ్బుపైరది ఆర్తిబాప

తే॥ కారుపొట్లిని గట్టేసి మారు చేన
ముందు మునమెల్లువానికి – ముందుముందు
మీకు మీకను కేకల మెచ్చుకొనగ
జొన్నకోతల తిరునాల శోభలలమె

తే॥ కోటమొనగాంద్రు మధ్యలో కొడవలిని ఎ
గేసి కట్టలు గట్టిరి – మీసములను
దిప్పిరొప్పుచు – పైననే తివిరిపట్టి
అందమొలకించు చూపులనాంద్రగనుచు

తే॥ కోతలో నేర్పుజూపిన కోతగాంద్ర
కందరికి కల్లుతాపె నానందపడగ
రెడ్డి, యానాటి యూహలు గడ్డములను
జారి రొమ్ముబ్బె – గర్వమ్ము సందడింప

తే॥ పలుకు పలుకున చిలుకతో పలికినట్లు
ఏమి 'మనకోత' కారుపొట్టేలు వచ్చె
చూడుమని చూడుమని ఆలితోడగూడి
మాడి మాటాడువేళ సంపదలు పొదలె

తే॥ గుంత మూకట్లు నిండుగా కోరినంత
గట్టిపెల్లల అన్నము – కందిపప్పు
పెట్టె మాయమ్మ లక్ష్మమ్మ – గట్టి పెరుగు
తోటి కొఱ్ఱన్నమే స్వర్గతుల్యమన్న

తే॥ పనికి దొంగలు లేరు మా పల్లెలోన
పనికి పనికొద్ది కూలి మా పల్లెలోన
ముల్లెగా మాకు నిత్తురు పల్లె రైతు
లందరిని తీర్చిదిద్దె మా అయ్యనాడు

కం॥ అన్నా ఏమని చెప్పుదు
ఉన్నది ఉన్నట్లు జెప్ప నూకొంటిరి మా
కున్నది సన్నది లాపై
ఉన్నది, బిగియించినట్లు, ఊరికి మెరుగై

కం॥ తొలికూతతో సుత
చెలివీడి చేల జేరుచు గూళ్ళన్
వలిమంచులోన వేసితి
మలవడవగుడాకురాలుననియానాళ్లన్

తే॥ చొప్పగూడులవేసి పై కప్పు దంట్ల
జుట్టి వానకు తడిసినా ఎట్టి చెరుపు
రాని విధముగ గుదియించి – రాత్రులందు
నిద్దురలుమాని చేసితి నెరులుపొరల

తే॥ కందులును పెసలు సెనగలు కల్లమందు
గల సమస్తము – వడిపి – మాగాటిపసుల
మేపు వాములుగా పోయ – మేరమీరు
ననుచు కంకుల కోతకు నాత్రపడుచు

ఆ॥ గూడువిచ్చపీకి కూలోల్ల కందించి
కంకికోతజేయ కలియ బలికి
పొట్టుజల్లతోడపోటుజల్లలకెత్తి
తొక్కి తక్కి బండ్లతోలినాము

తే॥ గట్టి కల్లాల కంకుల కలియబోసి
కుప్పగా జేసి ఒకనాడు గుండ్లుదిప్పి
గట్టి జొన్నల రాశిగా కట్టినాము
మెరయు రత్నాలరాశిగా మేమునాడు

తే॥ పడుగుగగ్గుల కొట్టగా పల్లె పడుచు
లందరందరూ కళ్లాలయందెయుండి
గొగ్గి గగ్గుల పడుగులకోనివారు
గింజగింజకు ఒక యేటు పంజుకొంచు

తే॥ గింజలింటికి మోయ రాగిల్లు ఎడద
నన్ను మునిగాళ్ల నడిపించె – నాటి తీరు
చెప్పలేనయ్య – రెడ్డి నా చేయు పనుల
నెరిగి – నా యిష్టముగ గింజలిచ్చినాడు

తే॥ ఒక్కజొన్నల కలములో నొక్కపుట్టి
గింజలైనవి రాశివి (నావని) - గిట్టుబాటు
గాగ - మిగతవి కూడ నా కబ్బినాయి
అన్ని కళ్లాలతో భాగమయ్యెనాకు

కం॥ కొఱ్ఱలు జొన్నలు రాగులు
ఎఱ్ఱనికందులును పెసలు - ఎన్నికసెనగల్
నఱ్ఱిగెలులవలు గోగులు
కఱ్ఱిగలారికెలు మాకు గలిగెన్ చాలన్

తే॥ నాకు ముట్టిన గింజల - న్నానిజంయి
కొట్టమున పట్టలేదు - నే కోరినట్లు
కొలవమూటెలు రైతింటి నిలవజేసి
చేసుధరకమ్మినాడనా చేతి మీద

ఆ॥ భూమి పుత్రులున్న భూస్వామి వలెనాకు
గట్టిగింజలిట్లు కలిగినాయి
నాకు కలిగినట్టి నాసంపదల గొప్ప
కోడెలకును చెప్పుకొంటి నుబ్బి

కం॥ ఏమోయని యనుకొందురొ
భూములు లేకున్న నాకు భూములగల వా
రేమేమో యనుకొనగా
కామందగు రెడ్డి యిచ్చె కళ్లముగింజల్

తే॥ ఉబుసుపోకకు గుడిలోన వున్నగుండు
నెత్తి తిరిగిన కండల సత్తువలను
జూపుకొంటిని నాయేడు – శుభలిచ్చు
ధర్మదాతను పలుమారు తలచుకొనుచు

తే॥ ఊరి తిరునాళ్లలో మాకు కోరినన్ని
కొత్త గుడ్డల బట్టించి గొప్పజేసె;
మేకపోతులగొట్టి తిందాక వూరి
గవని మారెమ్మ కంతటి కలిమి నాది

తే॥ కాలియచ్చుకు సరిపోవు కఱ్ఱ కొయ్య
అంపెతోకోసి ధట్టించి తుంపు వెట్టి
కొమ్ముకొవ్వున ఆరెతోకుట్టి వార్లు
పెట్టి గూడల మెట్లును కుట్టినాను

తే॥ వాములేసిన తోడనే సామిమలకు
పోవగా జెప్ప – "మంచిది పోయిరార
యిదుగొ దారికి కర్చుకు – యిందలెక్క"
లెక్క పెట్టక యిచ్చెనా బక్కపనికి

తే॥ ఆ మహాత్మునికీనాడు ఆపదొచ్చి
ఒకగానొక్క కొడుకుకు దిక్కుజూప
కట్టులన్యాయముల మింగి హరుని పోలి
తూలిపోయెను; నేటి వాదులకు తలకి

తే॥ చెప్పగా లేను ఆ యింటి గొప్పలన్ని
అందరికి నీడగా వున్న ఆ మహాత్మ
దాన గుణమింతయని చెప్ప – తగను తగను
తగనటంచని గంగడు పొగిలి యేడ్చె

తే॥ వాని దుఃఖమ్ము నోదార్చు వారు లేరు
వాని బాధల గడబెట్టు వారు లేరు
వాని దిగులుల తొలగించు వారు లేరు
ఊరకుండిరి అరుగుపైనున్నజనము

తే॥ అప్పుడే వచ్చె బడిపంతులయ్యగారు
గంగనికి వచ్చినట్టి దుఃఖమ్ము మాన్ప
పూని – "ఎందుకురా ఆర్తి – పూర్వపుణ్య
ఫలములిట్లయి ముంచె; నాపన్నులమిక

తే॥ దుఃఖభారమ్ము నాపుకోతూలిపోయి
చెప్పతమకించి తమకించి – చెప్పలేక
ఊరి పెద్దల నిందింపనేలనయ్య
అందందరె ఏమని యనగగలము

తే॥ అనుచు వాపోయి రెడ్డితోడైన దాది
కొన్ని ఔదార్యగుణముల కోరి చెప్ప
అరుగుపై కూరుచుండ నాయాసలుడిగి
చెప్ప మొదలిడె అయ్యనాచేయినిమిరి

తే॥ ముప్పదేళ్లక్రింద ముచ్చునగుంతల
గ్రుద్ది వచ్చె కరువు – గూళ్లు కదల
బొందు బీకినాము పోయిరివలసలు
అక్కలించు కడుపులార్తినింప

తే॥ కూలినాలిలేక గూడును గుడ్డయు
లేక పేదలంత చీకి బట్టి
చేలనట్టుతొగను – మేలిగుద్దేండ్లను
వట్టి పోయినారు పట్టపగలు

తే॥ పొరుగు ఊర్లకు కొన్నాళ్ళు – పొద్దునూకు
లలవిగానట్టి చెమటలు కలిగిపోయి
నట్టు జంపిరిచేలలో – నాటి కష్ట
గతికిమారెడ్డి చలియించి – కపిలబావి

తే॥ ఊరిమందల చేనిలో వున్నపలన
త్రవ్వగా చెప్పి యొప్పించె ధర్మపరుడు
పేదవారికి పనిపాటలాదిగాగ
సర్వమును చక్కబెట్టైతా సంతసమున

తే॥ కొండరాళ్ళను పీకించి మండుటెండ
సమ్మెటల పగుల గొట్టించి సాపుబండ
లన్ని బండ్లకు నెత్తించి అడుగు నుండి
కట్టకము గట్టి గింజల రాశితోసి

తే॥ పోసినాడన్న పేదల పున్నెమనగ
నూతిలోనున్న నీటితో చేతికర్చు
పెట్టి పైరుల బెట్టి రాబట్ట సిరుల
అందరికి పంచి పెట్టినాడన్న రెడ్డి

తే॥ ఆతడన్నిట తెగబడి - నూతిలోని
నీళ్లతో ఎర్రజొన్న పండించినాడు
కల్లముననున్న రాశి తాకొల్లపెట్టి
నాడు చిట్టెడు గింజలుగూడ విడక

తే॥ కరువులో బావి త్రవ్విన ఘనుడతండు
నా పొగడ్తల కెక్కెనయ్యా - గడించు
పున్నెముల పొన్న తోటల పెంచినాడు
నేటికిట్లయ్య ఉండినచోట చిక్కి

తే॥ గాలికాలమునుండి యుగాది వరకు
అతుకుబతుకుల అన్నానికై - తెగించి
ప్రక్క ఊర్లకుపోయి తాలెక్కలిచ్చి
గింజలన్నింటి కొలిపించి కీర్తికెక్కె

తే॥ కరువుబరువును తామోసి కటికపేద
సాదలకు కడుపునింపిన ఘనతదలచి
రచ్చబండల పెద్దలు రిచ్చపోయి
రతని సాహసవృత్తికి అప్పుడతడు

తే॥ ఊరిచదువులకై బడి నొకటిపెట్టి
నన్ను పిలిపించి నెలనెలనాకు జీత
మిచ్చి బడిపిల్లలను చూచి – యీవి తావు
లలను నవ్వుల రువ్వెను ఆర్ద్రహృదుడు

తే॥ అందుకోలేని యానందమందు ముందు
కందుతీసిన మొనగాడు – కమ్మనలకు
కమ్మనైయున్న పదునారు కళల చంద్రు
డతని త్యాగమ్ము భోగమ్ములలమెదిశల

తే॥ రామ భజనలు గుడి నిరామయముగ
జరుగు నేర్పాటు గావించె – యిరుగుపొరుగు
వారి యుత్సాహములు పొంగ – వారి రాగ
తానముల సోలు పాటల తనిసిరయ్య

తే॥ తండమైవచ్చు గూడెము దాసరోళ్ల
వీధినాటకములచూడ వేచి వారి
అన్ని కథలను వినిచూచి అందరికిని
చూపిచెప్పించినాడు విశుద్ధమతిని

తే॥ నాటరేగుప్తి మొదలుగా ఆట దరువు
రాగముల సోలిపోయిరి – రక్తి నిండు
గుండెలకు బొండుమల్లెలు కొసరినట్లు
అన్నిటికి రెడ్డి సూత్రమై యలరెనెపుడు

తే॥ గొల్ల కోమటి కమ్మరి కుమ్మరులును
తగిన సంభావనలనిచ్చి దరువు మరిగి
ఆటలొప్పించి యాడించి రాస్తకొలది
అంత అభిరుచి కల్గె నెయ్యములు పొరల

తే॥ ఊరిపొరాటనాడు యోగోల్లసంబు
ఎవరి తరమౌను వర్ణింప - ఏటికేటి
కెంతరెట్టింపు! అందరు సంతసపడ
అన్నదానాలు చేసినాడయ్య రెడ్డి

తే॥ పనికి మాలినవాడు దర్పములజూపి
అంపు చేయుచు రాబట్టె సంపదలను
గుంపులంపుల మేయు నీతుంపరలను
కూడ ఐశ్వర్యమబ్బెవాకొనగరాదు

తే॥ పేడకాడికి కూడ కొట్టాడి, వాడ
గదరగొట్టుచు, కచ్చెకు కాలుదువ్వ
మొండి జగమొండి వారికీ కుండకుదిరె
వారెపో దేవుడని చెప్పు వారు నిజము

తే॥ ఇంత అన్యాయమేటికో? యిహపరంబు
లున్నవని చెప్పువారు రేపున్న జన్మ
కెత్తిపెట్టిన వాడని కొత్తకొత్త
నీమములు జెప్పి యొప్పింత్రు నేర్పుమీర

తే॥ ఇప్పుడిక్కడలేనిదింకెప్పుడనుచు
పిల్లవారలు కూడ రూపింపగలరు
తరిగిపోయిన సంపదలలవి యౌనె
మరల రాబట్ట నేమిటి మాటలన్న

తే॥ వానలే లేక భూములు పండలేవు
భూమి పండకయున్నచో భుక్తి లేదు
భుక్తి లేకున్న కళలకు ముక్తి లేదు
కళలు లేకున్న దేశమే కరణి నిలుచు

తే॥ అన్నియుత్పత్తి శక్తులు అందరికిని
అందుబాటైన సకలమ్ము నాస్తకొలది
కోరికలు దీర పండించు కొంద్రు – ఆస్తి
వ్యక్తి చేతికి చిక్కిన – వచ్చు కీడు

తే॥ ఉన్నవానికి సంపదలున్నవాని
కేలచింతలు ఎట్లనో వాలువదికి
పెల్ల లూడొచ్చినట్లు దోపిడుల జేసి
కుప్పపై కూరుచుందురు – తప్పులేదు

తే॥ న్యాయనిష్ఠూరములకు నాయాసపడనె
దొంగ తలవంచియూరకదోచుకొనుచు
దేవునికి చెప్పుకోమని తెలియజెప్పి
మూటగట్టునుగాని మోమోట లేక

తే॥ నాకు తోచినదిద్ది యీలోకమంత
నన్ను తిట్టిన కొట్టిన ఉన్నమాట
చెప్పుకోకుండ ఉండను – ముప్పుటూర్పు
లుట్టిగట్టుచునూరేగె – ఓపలేను

తే॥ "తాడు తక్కువ బావిని పూడిపించ
మన్న చందము" – వెఱ్ఱిమారెన్నలంత
కంతకెగప్రాకిపోయిరి ఆస్తిపెంచి
మంచివాడుగ బతుకు నమ్మకము లేదు

తే॥ బీదరైతుల పొలములు బీదపడిన
ఎరువులకు సాయపడినాడు – కరువులొచ్చి
అన్ని అప్పులు మునిగి నాయన్న కపుడు
పూర్తి యిచ్చిన పాపాన పోవలేదు

తే॥ ఆలినమ్మిన అప్పుదీర్చాలటన్న
నీతిఏమైనదాడ యీనేల కూటి
కింత సూంతియు లేక నల్లేరు మీద
బండ్ల తొలినయట్లు రాపాడినారు

తే॥ ఇది యెదోదైవలీలగా మదులదలిచి
తలచి తలపింపజేసిన ధర్మపరుల
బుద్ధి సూక్ష్మమ్ముగాదొ సాభూతురైతు
దోచుకొనుటకు వాటమైతో చెనన్న

తే॥ ఆస్తి తక్కువతో ఎవ్వరైనగాని
బతుకులీడ్చుట కష్టము బతుకలేదు
లేనినావంటి వానికి కానికాల
మందలములెక్క యందరికౌనె చెపుమ

తే॥ వామికొండలవంటి ఆసాములిట్లు
వాటుపడిపోయి కూటికై వాసిపోయి
దిక్కుతోచక చలియించి తెలివిమాలి
అయినకాడికి బతుకుట కయ్యెనిపుడు

తే॥ ఇట్టి కట్టడిరట్టడి కేది కార
ణంబు – ఎవ్వరు చెప్పరు – నాకు చూడ
దోపిడీలకు తావుగాదోచెనీ వ్య
వస్థ దీనిని మార్చుటవస్థయయ్యె

తే॥ కుండగోకుడుకూడ లేకుండ వట్టి
కడుపుతో కూలిపోవుటకౌనె చెపుమ
కరువులకు ఆటపట్టుగా పరువు బరువు
వచ్చు మూడేండ్లకొకసారి వరుసవరస

తే॥ కరువులో అప్పుపుట్టదు కాస్తకూస్త
ఆస్తిలేకున్న చిక్కదు ఆస్తులెపుడు
దోపిడీలను చేయించు – దోపిడీలు
లేక ఆస్తులురావు రాలేదు వెనుక

తే॥ దోపిడీలేని ఎవరినీ దోచుకోని
సమసమాజము రావలె - స్వానుభవము
లెన్నియుండిన కర్మగా లెక్కగట్టి
కొట్టి పారేసి తలవంచుకొంద్రు ప్రజలు

తే॥ దైవమేయున్న కర్మలెందాకనిలుచు
కర్మచేయని దేవుని మర్మధర్మ
మెవరు చెప్పరు - దేవుని కెవరు దిక్కు
కనుగొనంగ యీ ప్రజలె దిక్కనినుతింత్రు

తే॥ కూలినాలికి దోసెడు కొంపలేక
ఏమి పాపము చేసినారేమి కర్మ
చేసినారన్న - అట్లైన మాసులంత
పందులుగ కుక్కలుగ పుట్టువారు కాదె

తే॥ అట్ల కాలేదు మానవులంతకంత
కెక్కువై క్షుద్రప్రాణులే తక్కువయ్యె
ఎంచ మానవులందరు మంచివారొ
మరల మానవులైపుట్ట మరల మరల

తే॥ మానవులు చెడ్డకర్మల మానినారొ!
మానకున్నను ముందు జన్మలకు మరల
మానవులుగాగ పుట్టుట కౌనె - అపుడు
కుక్క నక్కల లోకమై కోలుపోదె

తే॥ తర్కములకందరాని కుతర్కములకు
ఎవడు భాష్యమ్ముచెప్పు – సంభవముకాని
మోక్షమార్గాల చూపి నమ్మించినారు
ఒరుల బతుకుల పిండుట కొరకు నిజము

తే॥ మాట తప్పని వాడుగా నూటికొకడు
ఉండునా? ఉండుటకు సాధ్యముండదయ్య
అగుచొ ప్రతివాడు నరకానికరుగు కాదె
ఉత్తమాటలె మిగుల క్రొంగొత్తలయ్యె

తే॥ యుగయుగాలుగా పేదల పొగులు దిగులు
గుండెలవిసినవందులో నుండి రగిలె
అగ్నియాఅగ్నిలో వారి యాత్మలోని
తిరుగుబాటులు పుటమయ్యె – తెలిసికోరు

తే॥ ఎన్నడో ఒక్కనాడు మాకున్న శక్తి
పుటము పాకముగా మారి పూర్వజన్మ
కర్మలన్నింటి ఒకసారి కడిగికొందు
మదియు దైవికమన్న అభ్యంతరమ్ము

తే॥ లేదులేదని – భౌతిక వాదవిధము
మంచిదైమించు – రానున్న మంచిగోరి
విప్లవాత్మక చర్యల వేగు కొరకు
కాచి మోటేసుకొనుట నిక్కము నిజమ్ము

తే॥ ఒకని దయ ఒకనికెందుకు సకల ప్రజలు
శాంతి సౌఖ్యాలతోవున్న చందమున్న
పాతనీతుల కాయువుపట్టు సడలె
అదిగొ! ఉదయమ్ము అందులో అదనుముట్టి

తే॥ రాగముల కాంతి కణికలు రాలుచుండె
వెలుగురవ్వలు దిక్కుల చెలిమి చేసె
మావి చివురుల రక్తిమల్ మల్లమసిగి
కావి కన్నుల కాంతిలో కాగుచుండె

తే॥ కట్టు కూలికి చేతుల కష్టమంత
గుంజి గంజికి సరిపోని కూళ్లనిచ్చి
పేదవారిని దోచుట పెద్దగాదు
ఐక్యతాసిద్ధి కూలీలకైనదిపుడు

తే॥ ఖండముల సామ్యవాదమ్ముగట్టి పనిని
చేసి చూపెట్టె – మానవ క్షేమమిట్లు
కన్నుకన్నునకగపడెగాదె –పేద
జనము వినరింక వారి యుజ్వల దిదృక్ష

తే॥ అసలు కొనలుగ సాగి సొంపెనయు పూల
బాటగానుండె – వారికి బలము గలిగె
దోపిడీ చేయు వసతుల తొలగతోసి
అసలుసిసలైన సంస్కృతి కాద్యులగుచు

తే॥ సాగిపోదురు ముందుకు ఆగిపోరు
పెట్టుబడిదారి పద్ధతి పెళ్లగించి
లేసి రాసాగినారు మాకేసివారు
వారితో మేము పోదు మవ్వారిగాగ

తే॥ ఏలయాలస్యమని చీకటింటిలోని
నలుసుకంటికి కనపడె నాన్యమగుచు
దిక్కుతోచని వానికి దిక్కుతోచె
పదర పదరక మందని పర్వులెత్త

తే॥ ఎంతలోతైన విషయ మీ చెంతకంత
పేదసాదల గురిగాగ – పెద్దవారు
తరచి చర్చోపచర్చల తర్కహితము
గతికి గతితార్కమై తీవ్రగతికి చేరె

తే॥ ఎవరు ఎవరాపగలరు తీవ్రైకరుతికి
మతి చలించకపోదు – సమ్మతుల – వేచి
చూచువారేరి – వారి – చేసాచియూచి
ముందుముందుకు నడిపింప మూగినారు

తే॥ అక్కళించిన డొక్కల వెక్కసమ్ము
ధనమదాందుల తలదన్ని ధర్మ సమ్మ
తమ్ముగా సౌఖ్యముల నిల్పుతారువారు
దూరభారమ్ము లేదు సిందూరరేఖ

తే॥ రేఖలో సౌఖ్యరేఖల లేఖ్యరుచుల
విచ్చివిరిసెను – నూత్న సంవేదనమ్ము
జనుల గుండెల పులకింపజాలె; నింక
కార్మికోద్యమ జంఝులు కదలబారె

తే॥ కర్షకావళి కొడవండ్లు కదలె కదలె
కార్మికావళి సుత్తెలూ కదలె కదలె
రెండు సేనలు రణభూమి దండు విడిసి
సింహనాదమ్ము చేసి రహోనినాద

తే॥ మిన్నిదిక్కులు ముక్కలౌనట్లు రేగె
విప్లవ జ్వాలలాకాశ వీధి నాక్ర
మించి ఎర్రని బాటల నుంచి పంచె
సమత మమతల సకల సౌఖ్యములుదక్క



పాల వెంకటసుబ్బయ్య, నల్లపాటి రామప్పనాయుడు, వైసివిరెడ్డి, పుట్టపర్తి నారాయణాచార్యులు
మల్లెమాల వేణుగోపాల రెడ్డి, మలసాని చంద్రశేఖర రెడ్డి

# దక్షిణానిలము

## (గేయ కావ్యము)

# అంకితము

**కీర్తిశేషులు తల్లిదండ్రులు**

**ఎమ్మనూరు కొండారెడ్డి**

**లక్ష్మమ్మగార్లకు**

# ముందుమాట

నాలో జాలువారిన భావసంకలనమే 'దక్షిణానిలము'గా రూపొందింది. ఇందులో చాల భాగం 'సంక్రాంతి' పత్రికలో ప్రచురింపబడిందే! ఆ పత్రికాధిపతులకు నా కృతజ్ఞత. నా యీ భావాలు సాహితీపరుల సంతోష పెట్టినచో ధన్యుడను. గేయ కృతి నిర్మాణం నేనిదివరలో చేయలేదు. లోపాలున్నచో సాహితీపరులు మన్నింతురుగాక. ఈ కృతి నిర్మాణంలో సహాయపడిన మిత్రులకు నా కృతజ్ఞత. దయతో నా కృతికి పీఠిక వ్రాసియిచ్చి ఆశీర్వదించిన మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యుల వారికి భక్తిపూర్వక నమస్కారములు.

**వై.సి.వి. రెడ్డి**

# పీఠిక

దీనికి దక్షిణానిలమని పేరు పెట్టినాడు కవి. అనగా దక్షిణము నుండి వీచిన గాలి యన్నమాట. ఈ నడుమ కేరళ ప్రజా జీవనమున గలిగిన యొక మార్పు యీ కవి భావమున కుద్బోధకమైనది. ఈతడు ఏ రాజకీయ భావములకును లొంగినవాడు కాకున్నను, అక్కడి చలనమును చూచినప్పుడు మాత్రము వారిలో ప్రాణశక్తి యున్నదనిపించిన దాతనికి నిజమే కదా! చట్రాయివలె గడ్డ కట్టుకొన్న బ్రతుకు బ్రతుకని యేమి గుర్తు? కవి సంపాదించుకొన్న యా యింత యావేశము కూడ పిచుకారుతో కొట్టినట్లు వెక్కసముగా కాక, యెంతయో సుకుమారముగా నడచినదీ కావ్యమందు. సహజముగా నీకవి సుకుమారుడు. అతని దృష్టిలో "కరుణా రసాత్ములే కవులు". వారి కావ్యములె అమృతాపగలు.

ఈతడేరికొన్న వృత్తము నవీన ఛందస్సులకు చేరినది, నవీనమని ఎందు కంటిననగా మనము క్రొత్త యనుకొనుచున్నాము గనుక, మనకు పొరుగు భాషయైన కన్నడములో 'రగడ' యని యొక వృత్తమున్నది. దానిని సుమారు 108 రీతులకు పైగా వారు వింగడించుకొన్నారు. ఇది యా జాతిలో చేరిన మాత్రా ఛందస్సు. మన జానపద వాఙ్మయములో యీ ఛందస్సున్నది. కాని యది మనకు సాహిత్యము కాకపోయెను. కొందరు వృత్తములు వ్రాయుట కష్టమనియు, అవ్యుత్పన్నులు మాత్రమే మాత్రాఛందస్సుకు చేయివైతురనియు చాటుచాటుగా ననుకొనుచుందురు. ఒక పనిలో దిగి పని చేయువరకు దాని కష్టము తెలియదు. మాత్రా ఛందస్సులలో కూడ యతిప్రాసములను పోషింపవలసిన బాధ్యతయున్నది. పద్యములు వ్రాయువారందరును వ్యుత్పన్నులేనని చెప్పు ధైర్యము నాకు లేదు. ఒకరీతిగా చూచినచో వృత్తరచనమున కంటెను యీ పని కష్టమే. అది ప్రహతమైన మార్గము. అందుకే రచన నల్లేరుపై బండివలె సాగిపోవును. ఈ మార్గము క్రొత్తది. దీనిని రచనలో నొదిగించుకొనుటకే కవి కొంత కష్టపడవలసి యుండును. ఇట్టి పండితమ్మన్యులే కొందఱు, పూర్వకాలమున ద్విపదనాక్షేపించిరి. ఎవ్వడో యొక యనామధేయకవి.

"ద్విపదకావ్యంబు ముదికాంత దిడ్డికంత" అని అన్నాడట. కొందఱింకను ముందుకు పోయి యీ యభాండమును శ్రీనాథుని నెత్తికి కట్టినారు. శ్రీనాథుడింతటి యరసికుడు కాడని నాతలపు. ప్రాత పద్ధతులను పట్టికొని వ్రేలాడు ఆ రసికులెప్పుడు గూడ నిట్లేయుందురు. మార్పు సహజమనుట వారెఱుగరు. నేడు మాత్రా ఛందస్సులను తప్పుబట్టువారీ తెగవారే.

ఈ కవికి 'శివభారతము', 'శివతాండవము', 'అసమర్థుని జీవయాత్ర' మొదలగు కొన్నిటిపై నొక ప్రత్యేకాభిమానమున్నట్లున్నది. ఆయా తావులలో వాని నాతడు మధురముగా ధ్వనింపజేసినాడు. అట్లే పెనుకొండ, తుంగభద్ర మొదలైన కొన్ని పదములు కవితలో దొరలెను. అవి యాయా ప్రదేశములపై కవికిగల యభిమానమునకు గుర్తులు. ఆంధ్ర రాష్ట్రములో పశ్చిమాంధ్ర కవులకు మొదటి నుండి యొక వైశిష్ట్యమున్నది మావైపు కొండలు కోనలు యెక్కువ. సహజముగా ప్రకృతిపై మాకభిమానమెక్కువ. అంతమాత్రమే కాదు అన్ని కళలయందును సమానమైన

యాదరము; ముఖ్యముగ సంగీతమునందు పెద్దన, తిమ్మన్న, రాయలు, రామకృష్ణుడు వీరందఱు కవులు మాత్రమే కాదు సంగీత విద్యాంసులు కూడ. నేటికినీ ఆ వాసన మాలో నశింపలేదు. అందుకే రెడ్డి వ్రాసిన "దక్షిణానిలములో" పొలములకు కాపుండి వడిసెళ్ళను జిమ్ముచున్న జవరాలు ''గాంధారమూర్చనాక్రమము''లో పాడినదట. ఆమెకంత సంగీతము వచ్చియుండుట ఆశ్చర్యమేయైనను కవికి సంగీతమునందుగల యభిమానము మాత్రము వ్యక్తమగుచున్నది. రాయలసీమ సాహిత్యము నీతడెంతగానో చదివినట్లున్నది. కొన్ని కొన్ని చోటులలో వారి పలుకుబడి కొట్టవచ్చినట్లు కనబడును.

"అతుల శైవల వతీ శతవేణి కల పుణికి" అన్నప్పుడు

"అతుల శైవల వతీ శతము లీనెడు మీకు నాయిచ్చు విమలార్ఘ్య తోయమెంత"

అని మాభట్టుమూర్తి పలుకుచునే యున్నాడు. ఇట్టి పోకడ లీ కృతిలో ననేకములు.

అన్నార్థులపై యభిమానము, వారు పడుగడకండ్లపై సానుభూతి, తరతరములుగా వచ్చు భావదాస్యము పై వచ్చిన నసహ్యము – నేటి యందరి కవులకు వలెనే యీతనికి కూడ కద్దు. క్రాంతియన్న యభిమానము, పరపీడన మొనర్చు పాశులపై రోత సమానముగానున్నవి. సామాన్యముగా నిట్టిభావముల నేమాత్రమైన వెలువరించువారి నందఱిని "మార్క్సిజము" కట్టడములో కట్టివేయుట యొక యలవాటైపోయినది. ఈ భావములు ఉండుటకు సామ్యవాదిగానే కానక్కరేదని నా మనవి. మన వర్ణవ్యవస్థ కూడ నీ ధర్మములనే చెప్పినది. ఈ కవి యొక్కొక్కసారి మహాప్రౌఢముగా చెప్పును. ఈ క్రింది భావ మట్టివానిలో నొకటి.

"అప్సరస్సతుల కైశ్యముల బోలిన చారు
చంద్ర కాంకిత బర్హి సందోహ బర్హ భా
రావసితమై యందమలరారు నడకతో"

అడువారి కొప్పును బర్హభారముతో పోల్చుట కవి సమయము. ఇక్కడ బర్హభారములు అప్సరస్సతుల కైశ్యముల పోలినవనుచున్నాడు. ఇదియొక యందమైన ప్రతీపాలంకారము. ఇట్లే కావేరిని "శీరంగ గేహినీశృంగార దర్పణ" మనుటలో కూడ నొక ప్రౌఢిమ యున్నది. ఇట్టి ప్రౌఢ భావములు ఈ చిన్న పొత్తమున సుమారొక పదియైనను కలవు. 'నిలువెల్ల సుఖము' గా బ్రతుకు ధనికులట యనుట యొక చక్కని సుకుమారమైన భావ నిర్మాణము.

ఈ నా పీఠిక స్థాలీపులాకన్యాయము అంతే.

సాహిత్య ప్రపంచమున నీ కవి యుజ్జ్వల భవిష్యత్తునకై యెదురు చూచుచున్నాను.

కడప — ఇట్లు

9-8-1960 — **పుట్టపర్తి నారాయణాచార్యులు**

# దక్షిణానిలము

కలకంఠ కూజితమ్ముల రక్తిమలు నించి
సెలయేళ్ల నుడులలో కలగాన మూటించి
ననకారు పుప్పొళ్ల నాగుబ్బుగ ధరించి
యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కవుల భావముల వాచవుల తేనెలు నింప
కలనాదముల గాయకుల సొక్కి సోలింప
విలిఖించు చిత్రకారుల కుంచె పులకింప
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

తరతరమ్ముల భావదాస్యమ్ము దొలగించి
పరపీడనా దురాచరణములు మాయించి
దళిత జీవుల యెదల ధైర్యమ్ము లెలయించి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

అమర వీరుల త్యాగ మాశలకు నెగబ్రాక
ప్రగతి శీలుర భావ బంభరము నదియింపు
నరజాతిలో క్రాంతి నవనవోన్మేషమై
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

పలుకు పలుకున చిత్ర కిలికించితంబుగా,
జగతి యంతయు నొక్క సంసారమని పల్కు
కరుణా రసాత్ములౌ కవిపుంగవులు మెచ్చ
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

కవిలోక భావసంక్రాంతి తెర లెత్తికొన
శివ రమ్య భారత శ్రీలాస్యముల నింప
చలితాభ్యుదయ నాట్యసంకేతముల బెంప
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

రణిత నూపుర ఝణంఝణత లావర్తింప
చెలువాచి జఘన కాంచీ కింకిణులు మ్రోయ
లలిత వలయిత పాద లాక్షారసము చింద
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

అలస సమబృంద లాస్యముల సొక్కుల నించి
మునివ్రేళ్ల ధరణి కపోలముల్ స్పృశియించి
యతుల శైవలవతీ శతవేణికలభుడికి
        యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

తరుణార్కు బంగారు పురుల కాంతుల నెక్కి
శిఖరముల చుంబించి, క్షితిజముల దీవించి
దుముకు సెలకన్నెలకు దోడుగా నీడగా
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

రోలంబ ఝుంకార రుతి షడ్జమన సోలి
కలకంఠకుల కుహూకారముల గ్రైవాలి
హరిదంతములకు దివ్యానురాగము బంచి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

సింహళానీత పిచ్ఛిల చంద్రబాలా ప
రాగ పటవాసకము లాగుబ్బుగా నించి
హరిదంగనల హృదుల నానందములు పెంచి
        యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

సెలకన్నె మేని వంపులలోన నర్తించి
తలపు పూ తేనియలు దట్టాడ, మిట్టాడి
యమరులకు ధరిణిపై నాసలను వెలయించి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

చిఱుతాకులను సరోవరలక్ష్మి నోదార్చి
భావాంబరమున దివ్యజ్యోతి వెలిగించి
వ్రతతీ సుమాంగులకు ప్రణయ మంత్రము పల్కి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

ఆకుపూజల చీరె నందముగ గట్టించి
చివురులను, పూవులను చెలువుసొమ్ముల బెట్టి
వాసంతలక్ష్మి చెంపల సొంపు లెలయించి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

దళిత మానవ తాప తప్త జీవన తటా
కములలో, భంగలోకములలో, సముదీర్ణ
తమములో, చంద్రికా సముదీర్ణతలు బెంచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

మలయ పర్వత సానువులలోన వర్తించి
కోమల మరుద్వృథా కూలముల నర్తించి
తుంగభద్రా సముత్తుంగ వీచుల దోగి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

గందవాడితో గ్రొత్త కాయమానము దీర్చి
గగణాంగణము నందు; కమలాకరము లందు,
మధుర ముగ్ధస్పర్శ మండనాయితముగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

తొలి మబ్బుతున్క చిన్కులకు పందిరి పెట్టి
మలి మబ్బుతున్క వన్నెల విందులకు సోలి
చలిత తారాపథమ్ముల రాగ మూటించి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

తమకించి పద్మినీ తరుణోష్ఠముల తేనె
సోనలానగ, సరస్సుల దోగి, భంగముల
మూపు ద్రొక్కుచు, బుగ్గముద్దులకు మనసుంచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

అలసాలస విలోకనాతిసుందరమైన
లతల బిడ్డల నవ్వులాటలో – గంధముల
కోకొల్లలుగ జల్లి కొసరి లాలించుచూ
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

నిలువెల్ల సుఖముగా నిలను బ్రతికెడు భాగ్య
వంతులకు కన్నులను బాగుగా దెఱచి, చూ
డుడు – బీద జనుల యుగ్గడువైన గోడనుచు
నలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

శ్రీరంగ గేహినీ శృంగార దర్పణా
యితమైన కావేరి నిచ్చగించుచు జూచి
చోళమండల మల్లికా లాలితుండౌచు
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

రాగ సంపదలు సర్వాంగీణమై తోవ
సంజవెల్గుల నికుంజాల సోలుచు వ్రాలి
రసలోక యామినుల రతమెంచి పులకించి
యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

లలితాముక్తాదామములు – వేణికా తతుల
శీత శీకరములను జెమరించి – పూవులను,
వెలిపట్టుగల లతా విభ్రమాంగుల గలచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

అందముల్గల ద్రాక్ష పందిళ్ళ నెగబ్రాకి,
దాడిమీసుమ రోహితాధర్మముల దాకి
పెనుగొండ చఱియలను విడబాఱి వగమాఱి
యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

మలయ పర్వత సానువుల నున్న భోగిగణ
ఫూత్కారములకు – తావుల జల్లి; భోగినీ
గమనమ్ములకు వింత గరువమ్ము లందించి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కలరతోత్సవ గీతికలు కోకిలలు పాడ
మెఱుగు తుమ్మెద ఱెక్క మేనాలలో తూగి
చలదుల్లసిత పుష్ప సామ్రాజ్యముల నేల
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

అఱచందురుని వెల్గు లాస్యమ్ముపై చింద
ఫణ మణీరోచి చెంపల నత్తమిల్లంగ
శివమూర్తు లొల్కించు సిగ్గుతో జగ్గుతో
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

శ్రుతిపుల్ల కుముదరోచులు భావముల బెంప
జలదాంత చంద్రరేఖలు నవ్వులను రేప
మలపు లెఱుగని వలపు తలపు లెలయించుచూ
యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

అవ్యక్త మధుర వీణాగానముల సోలు
మఱుపులో - తలపులో మెఱపులో - తరి తీపు
తెఱపిలో, గంధముల మురువు హసియింపగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఇంచు నవ్వుల కాంతి బంచు సంధ్యాకాంత
గండ భాగముల రాగముల తీరిచి దిద్ది
యర్ధేందు మకుటు నృత్యముజూచి తలయూచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కుటిల వల్లీ గంధ పట కుటీరాలలో
నట దనుస్యూత హృత్పుట కవాటాలలో
వాసనల వాసమై వాసముల వాసనై
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

రాగ భారాలసారామ సీమల దాటి
జంకించు ప్రియ వయస్యలకు బుద్ధులు సెప్పి
వావాడ మా వాడ వసియింప హసియింప
నలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

రంగారు బంగారు చెంగావి క్రోవిలో
వాసనల గరగించి, వాలుగన్నుల జల్లి
కుపిత యౌవత భావ గోపనము భాషింప
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

అనిల గాఢోపగూహనముచే మధువొల్క
మధు నదంబుల దోగు మత్తాళి గీతముల
సొక్కి, మా భూదేవి సోగముంగురు లొత్త
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

నిఖిలమ్ము తమకు బానిస భావములె తోప
చటులమౌ కటిక యాకటి చీకట్లు మూల్గు
కటు జీవితముల కుత్కంఠ మనసుల బెనచి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

క్రోధరూక్షంబుగా గొటరించుచు నుండు
నరరూప శార్దూల చరణ ఘట్టనలలో
మాటాడగాలేని మానవుల దీవింప
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

కనలు తమ కన్నులకు కావి కాటుక గాగ
యెదలేని కాముకుల నదలించి విదలించి
పరువు మరువము వోని పాపలకు బాసటై
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

మట్టి బెరసిన కాలిమెట్టె బరువై పోవ
పురులు పురులైన ముంగురుల నొత్తగలేని
దీనాంగులకు మదుల తేకువలు గల్పించి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

నెలకొన్న సుఖము నిప్పుల కుంపటుల బడగ
కనులలో బాష్పములు కాల్వలై యూరుపుల
గ్రాగుబ్రదుకుల గ్రొత్తకలలు చిగురింపగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

తొలికోడి కూత బొత్తుల పాప నెడబాసి
మలికోడి కూతతో పొలముజేరెడి బ్రతుకు
చిఱునగవు విడని వడిసెలకన్నె దిలకించి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

నిలువెల్ల చెమటతో సొలసి చిక్కిన దేహ
మాత్మలను దహియింప నావు రావురు మంచు
పొరలాడు భిక్షుకుల వరముగా భరముగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

చెట్ల నీడలె తమకు జీవితాశ్వాసమై
తమ బాష్పములె ద్రావి తమ దుఃఖములె మెసవి
కుతిలపడి వెతలబడు కోమలుల నోదార్ప
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కువలయము విధుకాంతిలవముచే పులకింప
విరిసి విరియని సిగ్గు మెఱుగు గన్నుల దోప
తీరైన సతులతో తెగని గుసగుస లాడి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

మావి చివురుల విందు మాసరంబుగ మెసవి
కసటు గొంతుకతో – పికమ్ము పంచమమూన
షడ్జమ గ్రామమ్ము చంచరీకమ్ములై
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

పుష్పకోదండ సంభూత తాప విధూత
లజ్జానగుంతలై – సజ్జకపు పొదరిండ్ల
మురియు రాగిణుల క్రొమ్ముడులలో సుడియుచూ
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

పొదలు విరికన్నె కన్నుదల రక్తిమ లూర
చదురు తుమ్మెద రెక్క లదిమి చుంబింపగా
వేడి కౌగిట జిక్కు వెలది దచ్చనలాడి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

పసమీఋ కట్టి జవ్వాది నంటున తలపు
లెసరేగి ప్రియులతో నేరాళముగ బెనగు
నాటవిక సుందరుల యమృత ఘర్మము లాని
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

చదలేట పొదలు హంసల పిండు పండువై
భావ వీచుల రేప ప్రణయినీ ముగ్ధరుచి
రాంగకంబుల క్రమ రాగమ్ము పండింప
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఇమ్ముగా మావి సెలగొమ్మ కెంజివురాకు
గుంపు లంపులు మేసి క్రొవ్వి కోయిల పిండు
జల్లించు పంచమ స్వర సంతతుల సోలి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కలిత కోకిల కుహూకారమై – నిబిడసుమ
కారమై, మదన హుంకారమై, మానినీ
మధనమై, వెలయు నామని సొబగులను జూడ
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

మందమ్ముగ కటీర మండలమ్ములు దిరుగ
వేబోకటను లేచి పెరుగు చిల్కెడి గొల్ల
గుబ్బెతల తమ్ములపు గ్రొత్త తావుల బూని
యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

మకరంద ఝరపాత మగ్నమై భగ్నమౌ
పక్షమ్ముతో భావ బంభరము పలవించి
కోన కోనల దన్ను గోరగా, చేరగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

వెండి కంచాలలో వెలది వెన్నెల బోసి
మనసార ద్రావు కమ్మని చకోరాలతో
మచ్చికలు జేయు దంపతుల కతలెంచుచూ
యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కల్పవృక్షచ్ఛాయ గదలి స్వర్ధుని దోగి
ఉద్వృత్త భంగముల కోడి భూమికి దూకి
పర్వతపు కటకముల పరుపుగా పొరలుచూ
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

భావ వేగము తోడ బయలులో పరువెత్తు
మేఘమాలికల కే మేలు దలపెట్టెనో!
కులపర్వతాలానములకు గట్టిగ గట్టి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

అరుణ చరణాగ్రముల నదిమి ముక్కున నాళ
ముల జీల్చు హంస పిండులకు బుద్ధులు సెప్ప
నూర్మ్మలను జల్లించి యులికిపడ జేయుచూ
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

మంచెలందున్నట్టి మదనాధిదేవతలు
పక్షులను దోలంగ వడిజిమ్ము యొడిసెల్ల
గాంధార మూర్ఛనా క్రమము నాకర్షించి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

మధుమత్త హృదయములు మధుపములు దాడిగొన
పులుకు పులుకున జూచు పువుబోండ్ల కింక మీ
కాశ్వాస మున్నదని యాదరంబున బల్కి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                        వీచెనమ్మా! యిపుడె!

అప్సరస్సుతుల కైశ్యముల బోలిన చారు
చంద్రకాంకిత బర్హి సందోహ బర్హ భా
రావసితమై యంద మలరారు నడకతో
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                    వీచెనమ్మా! యిపుడె!

శరదిందు చంద్రికా పరిరంభణములలో
తలపు తరగల లేపి పలుకు మెలపుల జూపి
యమృత కావ్యాపగల నాడు సత్కవులకై
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                    వీచెనమ్మా! యిపుడె!

అలరు దీవెల పొదల కలరవంబుల లేపి
పిల పిల మటంచు కంపిలు ద్విజావళి జూచి
తముబ్రోవగా నికుంజములు వేడగ బ్రోచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                    వీచెనమ్మా! యిపుడె!

చేరమండల రమ్య సీమంతినీ రక్త
గండపాళీ స్పర్శ గరగుచును లోలోన
నవఘుళించెడు క్రొత్త యాదర్శములు నేర్చి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                    వీచెనమ్మా! యిపుడె!

బీటవాటిన పాత కోట కొమ్ముల నెక్కి
పుట మాటినట్టి భూపుల చరిత్రల దలచి
బడలికలు వాయగా తడవుండి, యెదరోసి,
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                    వీచెనమ్మా! యిపుడె!

ఉటిమి తరుముచునున్న ఉప్పెనలు కష్టాలు
కడుపులో చెయివెట్టి కలచి నట్టులు గాగ
దగొన్న వగగొన్న దళిత మానవులకై
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

అన్నార్థులై చేసికొన్న ఘోర ఋణాలు
తను శల్యముల గాల్చ, మనుగడల బేనులై
ఈరీర్పులకు జిక్కి యిలదూలు ప్రజలకై
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

ప్రతిభా సమున్మేష భాసురులు, రసమయులు
శారదతనయులౌ సత్కవులె క్షుద్రసం
సారవాగురి జిక్కి చలియించిరని సొక్కి
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

కడచూడగారాని గహనాటవుల వోని
దారిద్ర్యముల దూరి తారి – దిక్కులజూచు
తాడితుల పీడితుల దాపు రాదారిగా
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

ప్రొద్దస్తమానమ్ము పొలములో పొరలాడి
యెండ వానల కోర్చి బండకష్టము జేసి
పులి నొప్పులను నీరసిలు కూలి ప్రజలకై
        అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
                                        వీచెనమ్మా! యిపుడె!

పల్లె పట్టుల యందు బని చేసుకొనుచున్న
కార్మికుల కర్షకుల గనుగొంచు, రాబోవు
కాలంబు మీదె నిక్కమ్ముగా ననిపల్కి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఒకచోట వృక్షాగ్ర మొకచోట గిర్యగ్ర
మొకచోట కేతుపట మొకచోట పూల పం
దిరి సొంత యిల్లుగా, తేనె సోనల బంచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఒకసారి మేఘమాలిక యంచు ముడివెట్టి
ఒకసారి మెఱుపుకత్తెకు ముంగురుల నొత్తి
ఒకసారి దిక్కాంతలకు పైట సవరించి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

తనుజూచి మాలతీ తరుణు లామోద బం
ధురలౌచు తలలెత్తి సరసమ్ముగా బిల్వ
వాని రాసిక్యమ్ము వలచి, ముద్దులదెలచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కడలన్ని వాసనల కమ్మగా విరియగా
ఉడుకారి మ్రోడులకు నెడద చివురింపగా
లతలు హర్షోత్కర్షలై సొరుపండింప
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఏనాటి చుట్టరిక మేనాటి స్నేహమో!
గాని – తుమ్మెదపిండు, గానముల కోయిలలు
యెడబాయలేక వెంబడిరాగ రీవిగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

బ్రదుకు సుడిగుండముల వలదనుత్సాహంబు
కర్మయోగమునందె కలదు భావిసుఖంబు;
యీ జీవనము నిత్య మిది సుఖం బనిపల్కి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

నిష్కుటంబులముందు నిలిచి, "మా ప్రియులు రా
లేదేమి" యని మూగబాధలో దిక్కులను
జూచెడు ఖగాంగనకు శుభమున్నదని పల్కి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

చేల గట్టుల హాయి నోలలాడెడి కాపు
గుబ్బెతల యిడగడాకుల పూల యడ్డిగల
పొరలెత్తు గంధముల పోనీక చవిజూచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఒక నాట్యకత్తెవలె నొక వింత కుంచితాం
గముల, సుమధురహాస కాంతి కాంతము, దేవ
గన్నేరు కరమంటి కౌగిళుల సొక్కుచూ
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

సిగజుట్టి బొమలెత్తి శేఖరము గైసేసి
సరస భావనల లాస్యము సేయ నుంకించు
కొండ గోగులను సాకూతమ్ముగా జూచి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఒక నిట్టచూపు కోరకముపై నాట వే
రోక తీపిచూపు కింశుక పుష్పవతి దూట
యెడద నిండిన కోర్కె లడపగా సుడియుచూ
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ప్రచ్ఛాయ శీతలోపరిదేశముల, మోసు
లెత్తి పూచెడి లతాళిని జేరి, కోరికల
విప్పిచెప్పుచు - హృదయ మప్పనము గావించి
యలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

పురివిప్పి తన్మయత మురిపెముల నాట్యముల
సోలు నెమళుల వింతసోయగము వీక్షించి
మేఘమాలిక ముట్టి మెయి గగుర్పొడువగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కలక దేరిన శారికల దివ్య కలగాన
ములకు - నేతెంచు మబ్బుల జారు కాంతులకు
నిలుపోపలేని పోకలబోయి - హాయిగా
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఒక పెద్ద గండశిల నొరసి 'నేనని' తెలిపి
ఒక చిన్న పూల మొక్క్మొగ దాటుల వెట్టి
ఒక నదీ సతి సుందరోర్మికల సరిదిద్ది
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

ఆమూల చూడముగ నానందమున బూచు
మామిడుల ధూళి ముమ్మరముగా మెయినంట
తనుపారు రక్త చందనపు పూతగ నిల్వ,
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

కలలోని వార్తవలె కలిమి దూరముగాగ
పొలికలన వట్టి చేతుల బోరు పోటరిగ
వెతలబడు మానవుని కతలెంచి, కోపించి
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

పరుల రక్తము తమకు బ్రదుకుగా, ప్రజల వం
చించుటయె విద్యలై శీర్షమెత్తుచు దిరుగు
కుటిల మానవు లింక గూలెదరు నిజమంచు
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!

తమ గొల్చు పూల బిత్తరుల యెడదల సుడియు
భావముల విరియించు పనిలో నిమగ్నమై
బాధితుల దీనభావముల వ్యాఖ్యానింప
అలసముగ దక్షిణానిలము మా గడ్డపై
వీచెనమ్మా! యిపుడె!